RNI No. APTEL/2008/23088

# తెలంగాణ పత్రిక

TELANGANA PATRIKA
TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

నిజం మా నిజన్

Epaper.Telanganapatrika.in

తెలంగాణ తల్లి

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
నిజం మా నిజన్
18వ వసంతంలోకి

EDITOR :BOORLA VENKATESHAM KARIMNAGAR VOLUME:18 ISSUE:39 TUESDAY,JULY 7,2026 PAGES:12 COST: 5 /-

ఎడిటర్ : బూర్ల వెంకటేశం కరీంనగర్ సంపుటి :18 సంచిక :39 మంగళవారం, జూలై 7, 2026, పేజీలు -12 వెల :5/-

CIRCULATED BY : ADILABAD, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULAMBA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOOBNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRCILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI



## మారబోతున్న భాగ్యనగరం..

**'మూసీ' నదికి అదిరిపోయే కొత్త లుక్.. ప్లాన్ చూస్తే షాకే!**

**తెలంగాణ పత్రిక ప్రతినిధి:** హైదరాబాద్ మహానగర ముఖచిత్రాన్ని మార్చేలా ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. భవిష్యత్తు సవాళ్లు, వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని ఏకంగా లక్షన్నర క్యూసెక్కుల గరిష్ఠ వరద ప్రవాహాన్ని సైతం తట్టుకునేలా మూసీ నది డిజైన్లను ప్రభుత్వం సిద్ధం చేసింది. ఈ ప్రాజెక్టు తొలి దశ పనుల అంచనాలు, నిధుల సమీకరణ, అమలు విధానంతో కూడిన సమగ్ర నివేదికను పురపాలక శాఖ ఇటీవల మంత్రివర్గానికి సమర్పించింది. హైదరాబాద్ మహానగర ముఖచిత్రాన్ని మార్చేలా ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర 2లో

## అంతర్జాతీయ టూరిజం హబ్‌గా తెలంగాణ..

- -పర్యాటక రంగంపై సీఎం
- -రేవంత్ ఉన్నతస్థాయి సమీక్ష
- -తెలంగాణను అంతర్జాతీయ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యం
- తారామతి బారాదరి, దుర్గం చెరువు అభివృద్ధికి ఆదేశాలు
- వికారాబాద్, వీరభద్రస్వామి ఆలయ అభివృద్ధిపై దృష్టి
- మరిన్ని ఎకో పార్కులు, ఫ్యూచర్ సిటీలో అర్బన్ ఫారెస్ట్ ప్రాజెక్టులు
- పురానాపూల్‌ను పర్యాటక కేంద్రంగా మార్చే ప్రతిపాదన



**తెలంగాణ పత్రిక ప్రతినిధి:** తెలంగాణను అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఈ దిశగా ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యాటక శాఖపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. తారామతి బారాదరిని ప్రముఖ పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చేయాలని, దుర్గం - మిగతా2లో

## ప్రియుడి మోజులో భార్య ఘాతుకం..




**భర్త నరాల్లోకి హార్పిక్ ఎక్కించి మర్డర్..!**

**తెలంగాణ పత్రిక ప్రతినిధి:** వివాహేతర సంబంధానికి భర్తను అడ్డుగా భావించిన ఓ మహిళ, తన ప్రియుడితో కలిసి హత్యకు కుట్ర పన్నింది. ముందుగా భర్తకు అధికంగా మద్యం తాగించి, అనంతరం తీవ్రంగా దాడి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. బాధితుడు ఇంకా ప్రాణాలతో ఉండటంతో టాయిలెట్ క్లీనర్‌ను సిరంజి ద్వారా శరీరంలోకి ఎక్కించినట్లు విచారణలో బయట పడింది. ఘటనను ప్రమాదంగా - మిగతా2లో

## భారతదేశంలో మొట్టమొదటి హైడ్రోజన్ రైలు జూలై 17న ప్రారంభం..

**తెలంగాణ పత్రిక ప్రతినిధి:**

భౌగోళిక సవాళ్ల కారణంగా సాంప్రదాయ ఓవర్‌హెడ్ లైన్లను ఏర్పాటు చేయడం కష్టంగా లేదా అసాధ్యంగా ఉండే మార్గాల కోసం హైడ్రోజన్ రైళ్లను రూపొందించారు. మెరుగైన రవాణా కోసం హైడ్రోజన్ రైళ్లను రూపొందించారు. - మిగతా2లో



## రామ మందిర్ ట్రస్ట్ సమావేశానికి ముందు



**కలకలం సృష్టిస్తున్న ట్రస్ట్ అధ్యక్షులు మహంత్ నృత్య**

**తెలంగాణ పత్రిక ప్రతినిధి:** అయోధ్య రామ మందిరంలో జరిగిన దొంగతనం ఘటనపై శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ అధ్యక్షుడు మహంత్ నృత్య గోపాల్ దాస్ స్పందించారు. ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన ఆయన, ఇది అత్యంత బాధాకరమైన సంఘటన అని పేర్కొన్నారు. ఈ పాపానికి పాల్పడిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ విడిచిపెట్టకూడదని, వారికి అత్యంత కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. - మిగతా2లో




## జైలు నుంచి పోక్సో నిందితుడి పరార్..

**తెలంగాణ పత్రిక ప్రతినిధి:**

మహబూబ్‌నగర్ జిల్లాలోని జిల్లా జైలులో సంచలన ఘటన చోటుచేసుకుంది. పోక్సో కేసులో రిమాండ్‌లో ఉన్న నిందితుడు కిషోర్ జైలు నుంచి పరారయ్యాడు. ఈ ఘటనతో జైలు భద్రతా వ్యవస్థపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇందుకు సంబంధించి సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారుమహబూబ్‌నగర్ జిల్లాలోని జిల్లా జైలులో సంచలన ఘటన చోటుచేసుకుంది. - మిగతా2లో

## బీజేపీ నేతలు రాముడి హుండీలోని సొమ్మును కూడా లూటీ చేశారు



- -అయోధ్య రామ మందిర విరాళాల సేకరణలో భారీ అవినీతి జరిగిందన్న పొన్నం ప్రభాకర్
- -ఈ స్కామ్ కు మోదీ, అమిత్ షా, యోగి బాధ్యత వహించాలని డిమాండ్
- -దేశ ప్రజలకు బీజేపీ క్షమాపణలు చెప్పాలన్న పొన్నం

అయోధ్య రామ మందిర విరాళాల సేకరణలో కోట్ల రూపాయల భారీ అవినీతి జరిగిందంటూ తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాజకీయ ఎదుగుదల కోసం దేవుడిని వాడుకోవడంలో బీజేపీ - మిగతా2లో



## హుస్సేన్ సాగర్ ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణం

- ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్ చేపట్టిన ప్రాజెక్టుపై అధికారుల దృష్టి
- అనుమతులు లేవని స్పష్టం చేసిన ఇరిగేషన్ శాఖ
- నిర్మాణ స్థలాన్ని సంయుక్తంగా తనిఖీ చేసిన ఉన్నతాధికారులు
- విచారణ తర్వాత తదుపరి చర్యలు ఉంటాయని వెల్లడి

2

## 'ఉగ్రం' రైఫిల్‌కు కేంద్రం పచ్చజెండా..

- -ఆర్మీ, హోం శాఖ కీలక పరీక్షలను పూర్తిచేసిన 'ఉగ్రం' రైఫిల్
- -హైదరాబాద్‌కు చెందిన 'ద్విప డిఫెన్స్, డీఆర్‌డీఓ సంయుక్తంగా అభివృద్ధి
- -సీఆర్పీఎఫ్, ఐటీబీపీ వంటి కేంద్ర బలగాల్లోకి ప్రవేశానికి మార్గం సుగమం
- -ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తితో దేశీయంగా తయారీ

రక్షణ రంగంలో 'ఆత్మనిర్భర్ భారత్' స్ఫూర్తితో మరో కీలక ముందడుగు పడింది. తెలంగాణకు చెందిన స్టార్టప్ సంస్థ 'ద్విప డిఫెన్స్' స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన 7.62ఇ51 ఎంఎం 'ఉగ్రం' అసాల్ట్ రైఫిల్, - మిగతా2లో

## కాళేశ్వరం అవినీతిపై రేవంత్ రెడ్డి ఎందుకు మౌనంగా ఉన్నారు: రాంచందర్ రావు



- బండి భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై ముగిసిన వాదనలు
- -భగీరథ్‌కు బెయిల్ ఇవ్వొద్దని బాధితురాలి తరపు న్యాయవాది వాదన
- -సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని

2



## బండి భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్

- -బండి భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై ముగిసిన వాదనలు
- -భగీరథ్‌కు బెయిల్ ఇవ్వొద్దని బాధితురాలి తరపు న్యాయవాది వాదన

**తెలంగాణ పత్రిక ప్రతినిధి:**

పోక్సో కేసులో అరెస్టైన బండి భగీరథ్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో సోమవారం వాదనలు ముగిశాయి. 2లో

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
నిజం మా నిజన్
GENERAL NEWS

# అంతర్జాతీయ టూరిజం హబ్‌గా తెలంగాణ.. సీఎం రేవంత్ కీలక ఆదేశాలు

తెలంగాణను అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఈ దిశగా ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యాటక శాఖపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. తారామతి బారాదరిని ప్రముఖ పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చేయాలని, దుర్గం చెరువును పూర్తిస్థాయి టూరిజం హబ్‌గా తీర్చిదిద్దాలని సూచించారు. మంజీరా, దిల్‌కుషా గెస్ట్‌హౌస్‌లను ఆధునీకీకరించాలని చెప్పారు. టూరిజం హబ్ డెవలప్‌మెంట్ పథకం కింద వికారాబాద్‌ను అభివృద్ధి చేయాలని, అక్కడి వీరభద్రస్వామి ఆలయ అభివృద్ధికి యాదాద్రి తరహాలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పర్యావరణహిత పర్యాటకానికి ప్రాధాన్యమిస్తూ 'క్యూర్' పరిధిలోని అటవీ భూములను 'ఎకో టూరిజం' కింద అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. గుర్రంగూడ ఎకో పార్క్ తరహాలో నగరంలో మరిన్ని ఎకో పార్కులు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఫ్యూచర్ సిటీలోని అటవీ ప్రాంతాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అర్బన్ ఫారెస్ట్ ప్రాజెక్టులుగా తీర్చిదిద్దాలని తెలిపారు. ఈ ప్రాజెక్టుల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియమించాలని ఆదేశించారు. పాతబస్తీలోని చారిత్రక పురానాపూల్ వంతెనను ప్రత్యేక పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసే అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. అవసరమైతే అక్కడి ట్రాఫిక్‌ను మళ్లించి పర్యాటక జోన్‌గా మార్చాలని అధికారులకు తెలిపారు.

# మారబోతున్న భాగ్యనగరం.. 'మూసీ' నదికి అదిరిపోయే కొత్త లుక్.. ప్లాన్ చూస్తే షాకే!

హైదరాబాద్ మహానగర ముఖచిత్రాన్ని మార్చేలా ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. భవిష్యత్తు సవాళ్లు, వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని ఏకంగా లక్షన్నర క్యూసెక్కుల గరిష్ఠ వరద ప్రవాహాన్ని సైతం తట్టుకునేలా మూసీ నది డిజైన్లను ప్రభుత్వం సిద్ధం చేసింది. ఈ ప్రాజెక్టు తొలి దశ పనుల అంచనాలు, నిధుల సమీకరణ, అమలు విధానంతో కూడిన సమగ్ర నివేదికను పురపాలక శాఖ ఇటీవల మంత్రివర్గానికి సమర్పించిందితొలి దశకు రూ.7,345 కోట్లు మూసీ పునరుజ్జీవన తొలి దశ పనుల కోసం ప్రాథమికంగా రూ.7,345 కోట్ల అంచనా వ్యయాన్ని నిర్ణయించారు. అయితే ఇందులో భూసేకరణకు అయ్యే ఖర్చులను చేర్చలేదు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధుల్లో సింహభాగాన్ని, అంటే దాదాపు రూ.4,500 కోట్లను అంతర్జాతీయ ఆర్థిక సంస్థ అయిన ఆసియా అభివృద్ధి బ్యాంకు నుంచి రుణ రూపంలో సమీకరించాలని ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. మిగిలిన రూ.2,845 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం రాబోయే రెండేళ్ల బడ్జెట్‌లో విడతల వారీగా విడుదల చేయాలని ప్రతిపాదించింది. ఒకవేళ నిధుల కొరత ఏర్పడితే, మూసీ అభివృద్ధి సంస్థ పరిధిలోని ప్రభుత్వ భూముల విక్రయం లేదా లీజింగ్ ద్వారా సమీకరించే అవకాశాలను కూడా పరిశీలిస్తున్నారు.రెండు దశల్లో 55 కిలోమీటర్ల అభివృద్ధి మొత్తం 55 కిలోమీటర్ల మేర సాగే ఈ మూసీ కారిడార్ అభివృద్ధిని ప్రభుత్వం రెండు దశల్లో పూర్తి చేయనుంది. ఇందులో భాగంగా తొలి దశలో అత్యంత కీలకమైన 21 కిలోమీటర్ల మేర పనులను ప్రారంభించనున్నారు. హిమాయత్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు ఉన్న 9.2 కిలోమీటర్లు, అలాగే ఉస్మాన్‌సాగర్, గండిపేట నుంచి బాపూఘాట్ వరకు ఉన్న 11.8 కిలోమీటర్ల పరిధిని మొదటి విడతలో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతారు. భవిష్యత్తులో హైదరాబాద్‌కు వరద ముప్పు లేకుండా చూసేందుకు ప్రభుత్వం అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సర్వే చేయించింది. వందేళ్లలో ఒకసారి వచ్చే అత్యంత భారీ వరద పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని నిపుణుల కమిటీ అధ్యయనం చేసింది. ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ జంట జలాశయాల గేట్లు ఎత్తినప్పుడు దిగువకు వచ్చే గరిష్ఠ ప్రవాహాలపై రూర్కీలోని ప్రసిద్ధ 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైడ్రాలజీ' అభిప్రాయాలను కూడా సేకరించారు. బాపూఘాట్ వద్ద గరిష్ఠంగా 1.5 లక్షల క్యూసెక్కుల వరద వచ్చే అవకాశం ఉందని నిపుణులు తేల్చడంతో, ఆ నీరంతా నగరంలోకి ముంచెత్తకుండా సాఫీగా సాగిపోయేలా నది వెడల్పు, లోతు, బ్యూటిఫికేషన్ డిజైన్లను లాక్ చేశారు.ప్రత్యేక విభాగానికి ఆమోదం ఈ భారీ ప్రాజెక్టును ఈపీసీ పద్ధతిలో అంతర్జాతీయ ఏజెన్సీలకు అప్పగించాలని ప్రభుత్వం యోచిస్తోంది. పనుల పర్యవేక్షణ, వేగవంతమైన అనుమతుల కోసం మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో 147 ప్రత్యేక పోస్టుల మంజూరుకు కూడా ఆమోదం లభించింది. పురపాలక, రెవెన్యూ, అటవీ, పోలీసు, నీటిపారుదల శాఖల అధికారులను డిప్యుటేషన్‌పై నియమించి, ఈ ప్రత్యేక విభాగాన్ని బలోపేతం చేయనున్నారు.

# బీజేపీ నేతలు రాముడి హుండీలోని సొమ్మును కూడా లూటీ చేశారు

రాజకీయ ఎదుగుదల కోసం దేవుడిని వాడుకోవడంలో బీజేపీ పరాకాష్ఠకు చేరిందని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా సామాన్య ప్రజలు తమ స్తోమతకు తగినట్లుగా రామయ్య గుడి కోసం విరాళాలు ఇస్తే, కమలం పార్టీ నేతలు ఆ సొమ్మును కూడా వదలకుండా అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. "బీజేపీ నాయకులు శ్రీరాముడి పేరును, అక్షింతలను అడ్డం పెట్టుకుని ఇళ్ల వెంట తిరిగి విరాళాలు వసూలు చేశారు. తీరా చూస్తే ఆ నిధుల్లోనే కోట్లాది రూపాయల అవినీతికి తెరలేపారు. దేవుడి హుండీలోని సొమ్మును సైతం లూటీ చేయడం దేశ ప్రజలందరినీ అవమానించడమే" అని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ నేతల అసలు రంగును, వారి అవినీతి అక్రమాలను అక్కడి స్థానిక ప్రజలు ముందే గుర్తించారని... అందుకే అయోధ్య పరిధిలోని లోక్‌సభ స్థానంలో బీజేపీ అభ్యర్థిని అక్కడి ఓటర్లు ఓడించి బుద్ధి చెప్పారని పొన్నం ప్రభాకర్ గుర్తుచేశారు. భక్తి వేరు, రాజకీయం వేరని స్పష్టం చేసిన మంత్రి... ఈ విరాళాల కుంభకోణానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్‌లదే పూర్తి బాధ్యతని అన్నారు. దేవుడి పేరుతో సాగించిన ఈ పెద్ద స్కాంపై బీజేపీ తక్షణమే స్పందించాలని, దేశ ప్రజలందరికీ బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. భక్తి ముసుగులో రాజకీయ వ్యాపారం చేసే శక్తులను ప్రజలు ఇకనైనా గుర్తించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

# హుస్సేన్ సాగర్ ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణం.. రంగంలోకి ఉన్నతాధికారులు

హైదరాబాద్ నగరానికి తలమానికమైన హుస్సేన్ సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం (ఎఫ్‌టీఎల్) పరిధిలో అక్రమ నిర్మాణం జరుగుతోందన్న ఆరోపణలపై అధికారులు దృష్టి సారించారు. నీటిపారుదల శాఖ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండానే ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ఓ నిర్మాణాన్ని చేపడుతోందని ఫిర్యాదులు రావడంతో సోమవారం ఉన్నతాధికారులు రంగంలోకి దిగారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక అల నేతృత్వంలోని బృందం నిర్మాణ స్థలాన్ని సంయుక్తంగా తనిఖీ చేసింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి తమ శాఖ నుంచి ఎటువంటి అనుమతులు జారీ చేయలేదని నీటిపారుదల శాఖ స్పష్టం చేయడంతో ఈ తనిఖీలు చేపట్టారు. ప్రస్తుతం నిర్మాణానికి సంబంధించిన అన్ని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని, పూర్తిస్థాయి విచారణ అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు. చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిలో చేపట్టే నిర్మాణాలపై ప్రభుత్వం అత్యంత కఠినంగా వ్యవహరిస్తోంది. హైదరాబాద్ నగరానికి చారిత్రక, పర్యావరణ వారసత్వంగా ఉన్న హుస్సేన్ సాగర్‌ను సంరక్షించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

# కాళేశ్వరం అవినీతిపై రేవంత్ రెడ్డి ఎందుకు మౌనంగా ఉన్నారు: రాంచందర్ రావు

జనసంఘ్ స్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను హైదరాబాద్ లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయతో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు తదితర నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. దేశ సమైక్యత కోసం ముఖర్జీ చేసిన త్యాగాలు మరువలేనివని ఈ సందర్భంగా నేతలు స్మరించుకున్నారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ... కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యాలపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పొలిటికల్ డ్రామాలు ఆడుతున్నాయని మండిపడ్డారు. జాతీయ డ్యాం భద్రతా సంస్థ హెచ్చరించినా మరమ్మతులు చేపట్టకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ఏటీఎంలా వాడుకుంటే.. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి ఆ అవినీతిపై ఎందుకు మౌనంగా ఉంటున్నారని నిలదీశారు. మరోవైపు హైడ్రా కూల్చివేతల తీరుపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. హైడ్రా కేవలం పేదల ఇళ్లను టార్గెట్ చేస్తోందని... ఎంఐఎం నేతలకు చెందిన ఫాతిమా విద్యాసంస్థల అక్రమ కట్టడాలపై కోర్టులు తప్పుబట్టినా ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్–ఎంఐఎం దోస్తీ వల్లే ఈ పక్షపాతమని... హైడ్రా అందరికీ ఒకే చట్టాన్ని వర్తింపజేయాలని, లేనిపక్షంలో విపక్షాల అక్రమాలపై రాష్ట్రవ్యాప్త పోరాటానికి దిగుతామని హెచ్చరించారు.

# బండి భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్

భగీరథ్‌కు బెయిల్ మంజూరు చేయవద్దని బాధితురాలి తరపు న్యాయవాది కోర్టును కోరారు. నిందితుడి తండ్రి కేంద్ర మంత్రి కావడంతో కేసుపై ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. దర్యాప్తు పూర్తయ్యే వరకు బెయిల్ ఇవ్వొద్దని వాదించారు. ఇంకా పలువురు సాక్షులను విచారించాల్సి ఉందని తెలిపారు. ఈ దశలో బెయిల్ మంజూరైతే వారిపై ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపారు. భగీరథ్ జైలులో ఉంటేనే దర్యాప్తు పారదర్శకంగా సాగుతుందని పేర్కొన్నారు. మరోవైపు పేట్‌బషీరాబాద్ పోలీసులు దాఖలు చేసిన కౌంటర్‌లో కీలక అంశాలను ప్రస్తావించారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేశామని తెలిపారు. బాధితురాలి వాంగ్మూలం నమోదు చేసిన తర్వాత ఆరోపణల తీవ్రత దృష్ట్యా అభియోగాలను సవరించినట్లు కోర్టుకు వెల్లడించారు. బాధితురాలి వాంగ్మూలం ప్రకారం నిందితుడు స్నేహం పేరుతో పరిచయం పెంచుకుని పలుమార్లు లైంగిక దాడికి పాల్పడినట్లు ప్రభుత్వం తరపు న్యాయవాది తెలిపారు.

# 'ఉగ్రం' రైఫిల్‌కు కేంద్రం పచ్చజెండా.. హైదరాబాదీ స్టార్టప్ ఘనత

భారత సైన్యం మరియు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ (ఎంహెచ్ఏ) నిర్వహించిన కఠిన పరీక్షల్లో విజయవంతంగా ఉత్తీర్ణత సాధించింది. ఈ ఫలితంతో కేంద్ర సాయుధ పోలీస్ బలగాల (సీఏపీఎఫ్) అమ్ములపొదిలోకి ఈ స్వదేశీ ఆయుధం చేరేందుకు మార్గం సుగమమైంది. రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) పరిధిలోని 'ఆర్మమెంట్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్' (ఏఆర్‌డీఈ) సహకారంతో ద్వీప డిఫెన్స్ కేవలం 100 రోజుల రికార్డు సమయంలో ఈ రైఫిల్ ప్రోటోటైప్‌ను సిద్ధం చేసింది. దేశంలోని విభిన్న వాతావరణ పరిస్థితుల్లో నిర్వహించిన ఫీల్డ్ ట్రయల్స్, విశ్వసనీయత మరియు సామర్థ్య పరీక్షల్లో ఇది తన సత్తా చాటింది. దీంతో సీఆర్పీఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్‌బీ, ఎన్ఎస్‌జీ వంటి భద్రతా బలగాల్లో దీన్ని ప్రవేశపెట్టే ప్రక్రియ వేగవంతం కానుంది.

### రైఫిల్ ప్రత్యేకతలు

'ఉగ్రం' రైఫిల్ బరువు 4 కిలోల కంటే తక్కువగా ఉండి, 500 మీటర్ల దూరంలోని లక్ష్యాలను సైతం అత్యంత కచ్చితత్వంతో ఛేదించగలదు. ఇందులో 20 రౌండ్ల సామర్థ్యం గల మ్యాగజైన్ ఉండగా, ఇది సింగిల్ మరియు ఫుల్ ఆటోమేటిక్ ఫైరింగ్ మోడ్‌లను సపోర్ట్ చేస్తుంది. ముఖ్యంగా ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలు, క్లిష్టమైన ఆపరేషన్ల కోసం దీనిని ప్రత్యేకంగా రూపొందించారు. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో కేటాయించిన 13 ఎకరాల స్థలంలో ద్వీప డిఫెన్స్ తన తయారీ కేంద్రాన్ని నెలకొల్పింది. ఈ విజయంపై కంపెనీ ఎండీ సిబు జోసెఫ్ స్పందిస్తూ, వివిధ భద్రతా బలగాల నుంచి ఈ రైఫిల్‌కు మంచి ఆదరణ లభించగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పరిణామంతో రక్షణ రంగ పరికరాల తయారీ కేంద్రంగా అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్ స్థానం మరింత పటిష్ఠమైంది.

# ప్రియుడి మోజులో భార్య ఘాతుకం.. భర్త నరాల్లోకి హార్పిక్ ఎక్కించి మర్డర్..!

ఆనక బాంత్రూమ్ క్లీన్‌చేసే హార్పిక్ లిక్విడ్‌ని సిరంజితో ఇంజక్షన్ చేసి హతమార్చింది. టాయిలెట్ క్లీనర్ హార్పిక్‌ను శరీరంలోకి ఎక్కించి భర్తను హత్య చేసిన ఉదంతం తెలంగాణలోని నిజామాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. నిజామాబాద్ పట్టణ శివారు ప్రాంతంలో ప్రశాంత్, సంధ్య దంపతులు కాపురం ఉంటున్నారు. గత కొంత కాలంగా సంధ్య మరో వ్యక్తితో చనువుగా ఉంటోంది. అది కాస్త వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ క్రమంలో దంపతుల మధ్య విభేదాలు తలెత్తాయి. గతకొంత కాలంగా ప్రశాంత్, సంధ్య గొడవపడుతున్నారు. ప్రశ్నించిన భర్తను శాశ్వతంగా వదిలించుకోవాలని సంధ్య పక్కా స్కెచ్ వేసింది. పథకం ప్రకారం భర్త ప్రశాంత్‌కు అతిగా మద్యం తాగించింది. అతడు పూర్తిగా మత్తులోకి జారుకున్న తర్వాత ప్రియుడిని ఇంటికి పిలిపించింది. ఇద్దరూ కలిసి మత్తులో ఉన్న ప్రశాంత్‌పై తీవ్రంగా దాడి చేసి భవనం పై నుంచి కిందకు తోసేశారు. ఈ ఘటనలో ప్రశాంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అయినప్పటికీ అతడు ప్రాణాలతోనే ఉండటం గమనించి ఎలాగైనా అతడిని చంపాలనే ఉద్దేశంతో.. సంధ్య ఇంట్లో ఉన్న హార్పిక్ లిక్విడ్‌ను సిరంజిలోకి తీసుకుని ప్రశాంత్ నరాల్లోకి నేరుగా ఎక్కించింది. శరీరంలోకి విషపూరితమైన క్లీనర్ చేరడంతో ప్రశాంత్ కొద్దిసేపటికే అత్యంత దారుణ స్థితిలో ప్రాణాలు కోల్పోయాడు. ఆనక ఏమీ ఎరగనట్టు ప్రమాదంగా చిత్రీకరించేందుకు విఫలయత్నం చేసింది. ప్రశాంత్ కుటుంబ సభ్యులకు సంధ్య తీరుపై అనుమానం రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# భారతదేశంలో మొట్టమొదటి హైడ్రోజన్ రైలు జూలై 17న ప్రారంభం..

మెరుగైన రవాణా కోసం ఈ వ్యవస్థలు ఒక పరిష్కారంగా ఉంటాయి. భారతదేశం, జర్మనీ, చైనా, అమెరికా వంటి దేశాలకు చెందిన బృందాలు కూడా స్వచ్ఛమైన రైలు రవాణా కోసం హైడ్రోజన్‌ను ఉపయోగించడంపై పనిచేస్తున్నాయి. ప్రతిరోజూ లక్షలాది మంది ప్రజలు భారతీయ రైళ్లలో ప్రయాణిస్తారు. బుల్లెట్ రైలు నుండి వందే భారత్ వరకు అనేక రైళ్లు ప్రయాణికులకు ప్రత్యేక సౌకర్యాలను అందిస్తాయి. అయితే భారతదేశపు మొట్టమొదటి హైడ్రోజన్ రైలు ప్రారంభం కాబోతోందని మీకు తెలుసా? ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జూలై 17న హర్యానాలోని జింద్ నుండి దేశపు మొట్టమొదటి హైడ్రోజన్ రైలును జెండా ఊపి ప్రారంభించనున్నారు. ఈ రైలు జింద్–సోనిపత్ మార్గంలో గంటకు 75 కిలోమీటర్ల ప్రారంభ వేగంతో నడుస్తుంది.ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముందు హర్యానా ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైని ఏర్పాట్లను సమీక్షించేందుకు ఈరోజు జింద్‌కు రానున్నారు. ఈ ప్రాజెక్టును భారతీయ రైల్వే ద్వారా పర్యావరణహిత, స్వచ్ఛమైన రవాణా దిశగా ఒక ప్రధాన ముందడుగుగా పరిగణిస్తున్నారు. రైలు 1200–కిలోవాట్ల హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ ప్రొపల్షన్ సిస్టమ్‌తో నడుస్తుంది. ట్రయల్ రన్‌ల సమయంలో ఈ రైలు గంటకు 75 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంది. ఒక్కసారి ఇంధనం నింపితే దీని ప్రయాణ పరిధి సుమారు 250 కిలోమీటర్లుఈ రైలులో రెండు 1,200 ఎఔ డ్రైవింగ్ యూనిట్లు, ఎనిమిది ప్యాసింజర్ కోచ్‌లు ఉన్నాయి. అంతేకాకుండా ఫ్యూయల్ సెల్ సిస్టమ్, హైడ్రోజన్ నిల్వ సిలిండర్లు, బ్యాటరీలు, నియంత్రణ వ్యవస్థల కోసం కూడా ఈ రైలులో ప్రత్యేక స్థలం ఉంది. హైడ్రోజన్ ఇంధన సాంకేతికత ఒక రసాయన చర్య ద్వారా విద్యుత్తును ఉత్పత్తి చేయడానికి ఈ పద్ధతిని ఉపయోగిస్తుంది. దీని ఉప–ఉత్పత్తులలో హైడ్రోజన్ ఆవిర్లు, వేడి ఉంటాయి. అంతేకాకుండా, ఎటువంటి ఉద్గారాలు ఉండవు. ఈ రైలులో సుమారుగా 27 హైడ్రోజన్ సిలిండర్లను అమర్చారుఅలాగే వెనుక భాగంలో కూడా 27 సిలిండర్లను అమర్చారు. ఈ రైలు రూపకల్పన కూడా ప్రత్యేకమైనది. ఉత్పత్తి, నిల్వ, ఇంధనం నింపే కేంద్రాలలో హైడ్రోజన్ లీక్ డిటెక్టర్లను అమర్చారు. రైలు పొడవునా వివిధ ప్రదేశాలలో ఫైర్ డిటెక్టర్లను కూడా అమర్చారు. వీటిని క్రమం తప్పకుండా తనిఖీ చేసి, శుభ్రం చేస్తారు. ఈ రైలు రూపకల్పన, అభివృద్ధి కోసం ప్రభుత్వం పూర్తిగా స్వయం సమృద్ధి గల ప్రణాళికను రూపొందించింది.

# రామ మందిర్ ట్రస్ట్ సమావేశానికి ముందు..

అయోధ్య రామ మందిరంలో జరిగిన దొంగతనం ఘటనపై శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ అధ్యక్షుడు మహంత్ నృత్య గోపాల్ దాస్ స్పందించారు. ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన ఆయన, ఇది అత్యంత బాధాకరమైన సంఘటన అని పేర్కొన్నారు. ఈ పాపానికి పాల్పడిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ విడిచిపెట్టకూడదని, వారికి అత్యంత కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారుగోపాల్ దాస్, రామ మందిరం కోట్లాది హిందువుల విశ్వాసానికి ప్రతీక అని, ఇలాంటి ఘటనలు భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీస్తాయని అన్నారు. ఈ కేసులో నిందితులను త్వరగా గుర్తించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటారని తనకు పూర్తి విశ్వాసం ఉందని తెలిపారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఈ వ్యవహారాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకుని, నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఘటనను రాజకీయాలకు వేదికగా మార్చకుండా, విశ్వాసానికి సంబంధించిన అంశంగా చూడాలని మహంత్ నృత్య గోపాల్ దాస్ పిలుపునిచ్చారు. దర్యాప్తు పూర్తయ్యాక వాస్తవాలు వెలుగులోకి వస్తాయని, చట్టం తన పని తాను చేస్తుందనే నమ్మకాన్ని ఆయన వ్యక్తం చేశారు.

# జైలు నుంచి పోక్సో నిందితుడి పరార్..

పోక్సో కేసులో రిమాండ్‌లో ఉన్న నిందితుడు కిషోర్ జైలు నుంచి పరారయ్యాడు. ఈ ఘటనతో జైలు భద్రతా వ్యవస్థపై ప్రశ్నలు తలెత్తుతు న్నాయి. ఇందుకు సంబంధించి సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.అమరచింత పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఓ పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న కిషోర్‌ను ఇటీవల రిమాండ్‌లో భాగంగా జిల్లా జైలుకు తరలించారు. అయితే, జైలులో ఉన్న సమయంలో అతను టవల్స్‌ను కలిపి తాడు లా తయారు చేసుకుని, అదే సహాయంతో జైలు గోడ దూకి పారిపోయినట్లు సమాచారం. ఈ ఘటన సోమవారం (జూలై 06) ఉదయం వేళలో వెలుగులోకి వచ్చింది. జైలు సిబ్బంది సాధారణ తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో కిషోర్ సెల్‌లో లేడని గుర్తించారు. వెంటనే జైలు పరిసర ప్రాంతాల్లో గాలింపు చర్యలు ప్రారంభించారు. అయినప్పటికీ అతని ఆచూకీ ఇప్పటివరకు లభ్యం కాలేదని తెలుస్తోంది. పరారైన నిందితుడి కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. జైలు భద్రతలో లోపాలు ఉన్నాయా లేదా అనే కోణంలో కూడా అధికారులు విచారణ చేపట్టారు. టవల్స్ సాయంతో గోడ దూకి పరారవడం వంటి ఘటన ఎలా జరిగిందన్న అంశంపై ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు. ఈ ఘటన జిల్లాలో కలకలం రేపింది. జైలు భద్రతపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పరారైన కిషోర్‌ను త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.

# భాయి బాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి టిఆర్ఎస్ హెచ్ఎంఎస్



భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక జూలై 6

జిల్లాలో ఈనెల 9, 10, 11 తేదీల్లో నిర్వహించే భాయి బాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టిఆర్ఎస్ పార్టీ జిల్లా ఇన్చార్జి డి.వీరన్న, హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ పిలుపుని చ్చారు. సోమవారం కొత్తగూడెం పట్టణంలో నిర్వహిం చిన భాయి బాట పోస్టర్ ఆవిష్కరణలో పాల్గొని మా ట్లాడుతూ కల్వకుంట్ల కవిత సింగరేణి కార్మికుల సమస్యలు నేరుగా తెలుసుకోవడం కోసం బాయి బాట కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. కొత్తగూడెం, ఇల్లందు, మణుగూరు, అశ్వరా వుపేట, భద్రాచలం, సత్తుపల్లి నియోజకవర్గాల్లో కార్మికులు, ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుం టారని అన్నారు. కార్మిక సమస్యలు పరిష్కరిం చేందుకు యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చేందుకే ఈ కార్యక్రమం చేపట్టామని అన్నారు. ప్రజలందరూ కల్వకుంట్ల కవిత పర్యటనను విజయవంతం చేయా లని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు సారయ్య, టీఆర్ఎస్ నాయకులు వాసం రామకృష్ణ దొర, వాంకుడోత్ రవి,సోడెం వెంకట్,వి.సాగర్ హెచ్ఎంఎస్ నాయకులు క్రిష్ణ ప్రసాద్, ఆంజనేయులు, అశోక్, శ్రీలత, ఆసిఫ్, శ్రీను,పూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

# ఆరు గ్యారంటీలు ఎక్కడ..? కాంగ్రెస్ జవాబు చెప్పాలి

-హామీలు గాలికొదిలి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం
-రెండున్నరేళ్ల పాలనలో వైఫల్యాలే కనిపిస్తున్నాయి:
-ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాలు తప్పవని
-మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోదండ కృష్ణ గౌడ్ హెచ్చరించారు

వెల్దుర్తిమండల ప్రతినిధి,జులై 06 (తెలంగాణ పత్రిక):

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు పూర్తవుతున్నప్పటికీ, ఎన్నిక ల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోదండ కృష్ణాగౌడ్ ఆరోపించారు. సోమవారం ఏర్పా టు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఇప్పుడు వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందన్నారు. మహిళలకు ప్రతి నెల రూ.2,500 ఆర్థిక సాయం, రూ.500కే గ్యాస్ సిలిండర్, రైతులకు ఎకరానికి రూ.15 వేల రైతు భరోసా, వ్యవసాయ కూలీలకు రూ.12 వేల ఆర్థిక



సహాయం, వరి పంటకు రూ.500 బోనస్, యువత కు రూ.4 వేల నిరుద్యోగ భృతి, విద్యార్థులకు స్కూటీల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, సామాజిక భద్రతా పింఛన్ల పెంపు వంటి కీలక హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి రోజురోజుకూ దయనీయ ంగా మారుతోందన్నారు. ఎరువులు, విత్తనాల కొరత, పెరిగిన సాగు ఖర్చులు, పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పంట నష్టపోయిన రైతులకు తగిన పరిహా రం అందడం లేదని, రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు కాలేదని, రైతు భరోసా సకాలంలో అందక రైతాంగం తీవ్ర ఆందోళనలో ఉందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కేవలం ప్రకటనలకే పరిమితమైందని, ఎన్నికల సమయంలో చెప్పిన మాటలు అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిగా మరిచిపోయిందని విమర్శించారు. రైతులు, మహిళలు, నిరుద్యోగ యువత, విద్యార్థులు, వృద్ధులు ప్రభుత్వ తీరుతో తీవ్ర నిరాశకు గురవుతు న్నారని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతు సంక్షేమం, సాగునీరు, తాగునీరు, అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా సాగాయని, ప్రస్తుత ం రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని పేర్కొ న్నారు. ప్రజల సమస్యల పరిష్కారంపై ప్రభు త్వం దృష్టి పెట్టకుండా రాజకీయాలకే పరిమిత మైంద ని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీ ని వెంటనే అమలు చేసి ప్రజలకు న్యాయం చేయాల ని, లేకుంటే ప్రజల తరఫున బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రవ్యా ప్తంగా ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తుందని కోదండ కృష్ణాగౌడ్ హెచ్చరించారు.

# మార్కెటింగ్ కమిటీ చైర్మన్‌గా బానోత్ లాల్ సింగ్: విలేకరుల ఘన సన్మానం







కొత్తగూడెం:లిజులై 06(తెలంగాణ పత్రిక)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన బానోత్ లాల్ సింగ్‌ను స్థానిక విలేకరులు, ఆత్మీయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విలేకరులు మాట్లాడుతూ, లాల్ సింగ్ కాంగ్రెస్ పార్టీలో నిబద్ధత కలిగిన కార్యకర్తగా పార్టీ బలోపేతానికి అవిశ్రాంతంగా కృషి చేశారని కొనియాడారు. పార్టీ కోసం ఆయన చేసిన సేవలకు ప్రతిఫలంగానే మార్కెటింగ్ కమిటీ చైర్మన్ పదవి దక్కిందని అన్నారు. అట్టడుగు వర్గాలకు చెందిన షెడ్యూల్ తెగల కుటుంబం నుంచి వచ్చి, కింది స్థాయి నుంచి ఎన్నో త్యాగాలతో ఎదిగిన వ్యక్తి లాల్ సింగ్ అని విలేకరులు గుర్తు చేశారు. రైతులకు సేవ చేసే అవకాశం ఆయనకు దక్కడం సమంజసమేనని, చైర్మన్‌గా రైతుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. సన్మానించిన వారు: ఈ కార్యక్రమంలో డైరెక్టర్ మాలోత్ అశోక్, బొడ జనార్ధన్ తో పాటు స్థానిక విలేకరులు కురిమెళ్ల శంకర్, దాసరి సాంబశివరావు, జక్కుల పాల్గుణ, కత్తి బాలకృష్ణ తదితరులు పాల్గొని లాల్ సింగ్‌ను శాలువాతో సత్కరించి అభినందించారు.

# యస్‌డపిసి సెక్యూరిటీ సిబ్బందికి పునశ్చరణ శిక్షణా తరగతుల ప్రారంభం

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక జూలై 6

సింగరేణి వ్యాప్తముగా గల ఎస్‌డపిసి సెక్యూరిటీ గార్డులకు విడతల వారీగా నిర్వహించే పునశ్చరణ శిక్షణా తరగతుల లో భాగముగా 06.07.2026 నుండి రెండు వారాల పాటు కొత్తగూడెం ఎస్‌డపిసి ట్రైనింగ్ సెంటర్ నందు నిర్వహించిన 79వ పునశ్చరణ శిక్షణా తరగతుల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ఏరియా సెక్యూరిటీ అధికారి/ ట్రైనింగ్ అధికారి యం.డి. జాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు. ఈ సంధర్భముగా ఏరియా సెక్యూరిటీ అధికారి/ ట్రైనింగ్ అధికారి యం.డి. జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ సెక్యూరిటీ సిబ్బంది అందరికీ క్రమశిక్షణ అనేది ముఖ్యం అని, సెక్యూరిటీ సిబ్బంది నిర్వహించే విధులతో ఉన్నత యాజమాన్యం సంతృప్తిగా ఉందని, క్రమశిక్షణ మెరుగు పడాలంటే శిక్షణ అవసరమని, దానికి తగిన రీతిలో యస్‌డపిసి ట్రైనింగ్ సెంటర్ ను అభివృద్ధి చేసేందుకు ఉన్నత యాజమాన్యం సిద్ధంగా ఉన్నదని,ఈ శిక్షణ ద్వారా నూతన విజ్ఞానాన్ని పునికి పుచ్చుకుని, అధునాతన సాంకేతిక విజ్ఞానముతో విధులు నిర్వహిస్తూ, సింగరేణి ఆస్తులను కాపాడాలని కోరారు. సెక్యూరిటీ సిబ్బందికి బేసిక్ ట్రైనింగ్, రిఫ్రెషర్ ట్రైనింగ్, ఫస్ట్ ఎయిడ్ ఢ ఫైర్ ఫైటింగ్, అన్ ఆర్మ్‌డ్ కంబాట్ ట్రైనింగ్, ట్రాఫిక్ కంట్రోల్, ఇంటెలిజెన్స్ విభాగాల్లో శిక్షణనివ్వడం జరుగుతుందని, దానిలో భాగంగా, రిఫ్రెషర్ ట్రైనింగ్ లో పి.టి., డ్రిల్, సెక్యూరిటీ ఆపరేషన్స్ మూడు విభాగాల్లో శిక్షణ నివ్వడం జరుగుతుందని, శారీరక, మానసిక ధారుడ్యం కొరకు పి.టి., డ్రిల్, సెక్యూరిటీ ఆపరేషన్స్ లో బోధన ద్వారా సెక్యూరిటీకి సంబంధించిన విధులలో నూతన సాంకేతిక విజ్ఞానాన్ని తెలుసుకుని, సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు దోహదపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డి. నారాయణరెడ్డి, ట్రైనింగ్ ఇన్ స్పెక్టర్, ట్రైనింగ్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రైవేట్ పాఠశాలలో ఫీజుల దోపిడిని అరికట్టాలి : బచ్చలకూర సురేందర్

మునగాల - ప్రతినిధి, జూలై 6, తెలంగాణా పత్రిక



మునగాల మండలంలో ఉన్న ప్రైవేట్ పాఠశాలలో అధిక ఫీజులు వసూలను నియంత్రి ంచాలని రాష్ట్రవ్యాప్తంగా విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాల ని డివైఎఫ్ఐ మునగాల మండల అధ్యక్షులు బచ్చలకూర సురేంద ర్ సోమవారం ఒక ప్రకటనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని అదేవిధంగా పాఠశాలలలోని యూనిఫామ్ లు పుస్తకాలు విక్రయిస్తూ విద్యార్థులు మరియు తల్లిదండ్రుల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు మరియు అమ్మడం చట్ట విరోధం అయినప్పటికీ ప్రభుత్వ పర్యవేక్షణ కొరత వలన ప్రైవేట్ యాజమాన్యాలు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నారు అని అన్నారు. ఇప్పటికైనా మండల విద్యాశాఖ అధికారులు ప్రైవేట్ పాఠశాలను తనిఖీ చేసి ఈ అధిక ఫీజులకు అటుకట్ట వేయాలని వారు డిమాండ్ చేశారు.

# సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

రాజేంద్రనగర్ ప్రతినిధి జూలై 06, తెలంగాణ పత్రిక.



రాజేంద్రనగర్ నియోజకవర్గం లోని శంషాబాద్ మండలం చౌదర్‌గూడ గ్రామం ఇందిరారెడ్డి కాలనీలో సి.సి. రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రారంబి ంచారు . సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రం లోనే రాజేంద్ర నగర్ నియోజ కవర్గం అభివృద్ధి చెందుతుందని దానికి ముఖ్యమంత్రి కూడా సహకరిస్తున్నారని తెలిపారు రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మల్చలం లక్ష్మీలింగం , ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, కాలనీ వాసులు గ్రామస్థులు పాల్గొన్నారు.

# పచ్చదనమే ప్రగతి - పరిశుభ్రతే బాధ్యత

-ఆత్మకూర్ పోలీసులు ఆదర్శం





ఆత్మకూరు: జూలై 06, (తెలంగాణ పత్రిక):

పర్యావరణ పరిరక్షణతో పాటు పరిశుభ్రమైన కార్యాలయ వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో ఆత్మకూర్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం పచ్చదనం--పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ ఆర్. సంతోష్ ఆధ్వర్యంలో ఎస్సైలు, పోలీసు సిబ్బంది కలిసి స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించేందుకు కృషి చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లోని గదులు, ప్రాంగణం, పరిసర ప్రాంతాలను స్వయంగా శుభ్రం చేసి పరిశుభ్రతపై తమ బాధ్యతను చాటిచెప్పారు. ఈ సందర్భంగా సీఐ ఆర్. సంతోష్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా అంతే ముఖ్యమని అన్నారు. పచ్చదనం మానవాళి మనుగడకు ఎంతో అవసరమని, పరిశుభ్రమైన పరిసరాలు ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇల్లు, కార్యాలయం, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుతూ పచ్చదనాన్ని పెంపొందించే కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## అక్రమ భూమి కబ్జాను తొలగించాలని ప్రజావాణిలో పిర్యాదు

**-అధికారుల నిర్లక్ష్యంతో రైతులకు కష్టాలు**





**జగిత్యాల, జూలై 6 (తెలంగాణ పత్రిక):**

జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం నల్లగొండ గ్రామంలో ఒక వ్యక్తి దారి కబ్జా చేయడంతో తమ పొలాలకు మరియు ఇతర వృత్తుల ప్రజలు వెళ్ళడానికి అవస్థలు పడుతున్నారని గ్రామానికి చెందిన చెందిన ఏడే ముని రెడ్డి అనే వ్యక్తి సోమవారం ప్రజావాణిలో జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్ కు పిర్యాదు అందజేశాడు. ఈ సందర్భంగా ముని రెడ్డి మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నెంబర్ 162 లో రెండు బండ్ల బాటలు కలవు. అందులో ఒక్కటి నక్షతో కూడా ఉన్నది అది కుంట కట్ట ప్రక్క గుండా వెళుతుంది. ఈ సర్వే నెంబర్లోని వ్యక్తులు మోకా కన్నా అధికముగా రికార్డు ఉండటం వల్ల ఒక బండ్ల బాటను కన్నయ్య కుంట కట్ట ప్రక్కన వెళ్ళు దారి కబ్జా చేసారు. ఈ దారి గుండా సుమారుగా 50 మందిగా పైగా రైతులు మత్స్యకారులు పశుకాపరులు గత 70 సంవత్సరాల పైగా వాడకం చేస్తూ వారి పోలాలకు వెళ్ళేవారు అయితే ఇట్టి సర్వే నెంబర్ లోని రెడ్డివేని నీలయ్య అనువ్యక్తి గతంలో చెన్నాడి సత్యనారాయణరావుమరియు రెడ్డ వేని కొమురయ్య అను వ్యక్తుల దగ్గర కొన్న ఈ భూమి సాధా బైనామాలు పరిశీలించకుండానే మోఖా ఎంక్వైరీ చేయకుండానే అధికారుల నిర్లక్ష్యం వల్ల అతను కబ్జాకు ఉన్న భూమి కన్నా ఎక్కువగా రికార్డులో మార్పు చేసుకున్నాడు. సాధా బైనామా అప్రూవల్ ఇవ్వకుండ నీలయ్యకు పట్టా పాస్ బుక్ జారీ చేశారు. ఇతను తన కోడలు రెడ్డివేని కొమురవ్వ అను వ్యక్తికి గిఫ్ట్ డీడ్ చేశారు. ఇతని కొడుకు రెడ్డివేని శంకరయ్య మరియు శంకరమ్మ భర్త కొమురవ్వ బండ్ల బాట దారి క్రింద రికార్డు చేసిన ఖాతా నెం: 20001302. లోని 0-10 గుంటలు భూమిని పహాణిలో గల భూమిని మరల రికార్డు చేపించుకొని ఇట్టి దారి గుండా వెళ్ళే రైతులను మత్స్యకారులను పశు కాపరులను పోనివ్వకుండా కబ్జాచేసి ఇబ్బంది పెడుతున్నారు. ఈ విషయమై గతంలో కొడిమ్యాల తహసీల్దార్ కార్యాలయం నందు దరఖాస్తు ఇవ్వగా నల్లగొండ గ్రామ జీపీఓ విచారణ చేసినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కావున ఇట్టి బండ్ల బాట క్రింద తోలగించిన 0-10 గుంటలు యదావిధిగా బండ్ల బాట క్రింద రికార్డు చేయగలరని మరియు రెడ్డవేని నీలయ్య యొక్క సాధా బైనామా కాగితాలు పునః పరిశీలన చేసి రికార్డు చేసి మాకు న్యాయం చేయాలని కోరుతున్నామని అన్నారు. నష్టపోతున్న రైతులు ఏడే మునిరెడ్డి రేగుల లస్మయ్య మొగిలి లచ్చయ్య మొగిలి చిన్న నర్సయ్యతో పాటు దాదాపు 50 మంది ఉన్నారని బాధితుడు తెలిపారు.

## అక్రమ గుడుంబా రవాణాపై పోలీసుల ఉక్కుపాదం. నిందితుడి అరెస్ట్



**ఆత్మకూరు, జూలై 6 (తెలంగాణ పత్రిక):**

అక్రమ గుడుంబా (ఐడీ లిక్కర్) తయారీ, రవాణా, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించిన ఆత్మకూర్ పోలీసులు ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సీఐ ఆర్. సంతోష్ తెలిపారు. నల్లబెల్లి మండలం నందిగామ గ్రామానికి చెందిన ఇస్లావత్ సక్రు అక్రమంగా గుడుంబాను తరలిస్తూ, సరఫరా చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో పెంచికల్‌పేట్ వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించి అతడిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుడిపై ఆత్మకూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. నిందితుడిపై గతంలో నాలుగు కేసులు నమోదైనట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా సీఐ ఆర్. సంతోష్ మాట్లాడుతూ, అక్రమ మద్యం తయారీ, రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాంటి కార్యకలాపాలపై ప్రజలు పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# ఘనంగా డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి

**కోటగిరి తెలంగాణ పత్రిక జులై 6.**





కోటగిరి మండల కేంద్రంలోని సంఘమిత్ర కాలనీ వద్ద మాజీ దేశ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు దినేష్ ఆధ్వర్యంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న జిల్లా ఎమ్మార్పీఎస్ సహాయ కార్యదర్శి సోంపూర్ పోచిరాంతో పాటు మండల నాయకులు కలసి పూలమాలలు వేసి ఆయన చిత్ర పటానికి నివాళులు అర్పిస్తూ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి పోచిరాం మాట్లాడుతూ... ఆయన దేశానికి చేసిన సేవలను స్మరించుకుంటూ ఆయన అడుగుజాడలలో నడవాలని యువతకు పిలుపునిచ్చారు. దేశానికి ఆయన రక్షణ శాఖ మంత్రిగా ఎన్నో సేవలను అందించారని గుర్తు చేశారు. భారతదేశం పాకిస్తాన్ యుద్ధాలు జరిగినప్పుడు ఆయన రక్షణ శాఖ మంత్రి గా ఉండి భారతదేశానికి ఉత్తమ సేవలను అందిస్తూ భారతదేశనికి విజయాన్ని సాధించారన్నారు. దేశం లోని బడుగు బలహీన వర్గాల కోసం కుల వివక్ష ,సమానత్వ కోసం పాటుపడిన మహా గొప్ప వ్యక్తి అని కొనియాడారు. సమ సమాజం కోసం పాటుపడిన వ్యక్తి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎంఆర్పిఎస్ ఉపాధ్యక్షులు కన్నం శ్రీనివాస్ ఆస్గుల రవి పేగులాలయ్య సుధాకర్ అశోక్ అబ్బయ్య బిఆర్ఎస్ నాయకుడు నజీర్ ఖజా తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో పలు సమస్యలపై వినతులు స్వీకరించిన జిల్లా కలెక్టర్

**జగిత్యాల పట్టణం (తెలంగాణ పత్రిక) జూలై 6**




ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా ఈరోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 68 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఇదివరకు ప్రజావాణి లో వచ్చిన 197 పెండింగ్ దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలని లేని యెడల సంబంధిత జిల్లా అధికారి బాధ్యునిగా చేస్తూ మెమో జారీ చేయబడునని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్, జిల్లా రెవెన్యూ అధికారి ప్రసాద్, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ హరిణి, సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్ లు తదితరులు పాల్గొన్నారు.

# గ్రీవెన్స్ డేలో పలు ఫిర్యాదులను పరిశీలించిన జిల్లా ఎస్పీ

**జగిత్యాల పట్టణం (తెలంగాణ పత్రిక) జూలై 6**



జగిత్యాల జిల్లా ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేయడం, బాధితుల సమస్యలను నేరుగా తెలుసుకొని త్వరితగతిన పరిష్కరించడం లక్ష్యంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డే కార్యక్రమంలో భాగంగా, ఈ రోజు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపిఎస్ ప్రజల నుండి వచ్చిన పలు ఫిర్యాదులను స్వయంగా పరిశీలించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 22 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను వివరంగా తెలుసుకున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలను ఎస్పీకి నేరుగా వివరించారు. ప్రతి ఫిర్యాదుదారుడి సమస్యను జిల్లా ఎస్పీ తెలుసుకొని సంబంధిత పత్రాలను పరిశీలించి ప్రతి ఫిర్యాదును న్యాయబద్ధంగా, పారదర్శకంగా విచారించి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చట్ట పరిధిలో పరిష్కరించగల సమస్యలను ఆలస్యం లేకుండా వెంటనే పరిష్కరించాలని, విచారణ ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. జిల్లా పోలీసు శాఖ ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన సేవలను అందించేందుకు కట్టుబడి ఉందని, ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తోందని ఎస్పీ తెలిపారు.

# లేని భూమికి పట్టా ఎలా చేస్తారు

**-ఎలిగేడులో 18 గుంటల అక్రమ రిజిస్ట్రేషన్**
**-సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి**

**పెద్దపల్లి, ప్రతినిధి జూలై 6 ( తెలంగాణ పత్రిక )**




ఎలిగేడు మండలంలోని ఎలిగేడు గ్రామ శివారులో సర్వే నంబర్ 226లో మిగులు భూమి లేనప్పటికీ, 18 గుంటల భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసి పట్టాదారు పాస్‌బుక్‌లో నమోదు చేయడం ద్వారా ప్రభుత్వానికి నష్టం కలిగించారని రైతులు ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన అధికారులు, సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. రైతుల కథనం ప్రకారం, సర్వే నంబర్ 226లో మొత్తం 11 ఎకరాల 20 గుంటల భూమి ఉండగా, అందులో 2 ఎకరాల 10 గుంటలను ఎస్సారెస్పీ కాలువ, ఆర్‌అండ్‌బీ రహదారి కోసం ప్రభుత్వం గతంలోనే స్వాధీనం చేసుకుంది. మిగిలిన 9 ఎకరాల 10 గుంటలు సింగిరెడ్డి కుటుంబం ఆధీనంలో ఉన్నాయని, అదనపు లేదా మిగులు భూమి ఏదీ లేదని తెలిపారు. అయితే, 2012లో మోకా మీద భూమి లేకున్నా 18 గుంటల భూమిని మూసాల యుగంధర్ రెడ్డి పేరిట రిజిస్ట్రేషన్ చేయగా, అనంతరం 2015లో అదే భూమిని ముంజంపల్లి లింగమూర్తి పేరిట తిరిగి రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపించారు. అనంతరం ఆ భూమిని పట్టాదారు పాస్‌బుక్‌లో కూడా నమోదు చేశారని పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా సేకరించిన వివరాలు, అలాగే తహసీల్దార్ సమర్పించిన నివేదికలో సర్వే నంబర్ 226లో ఎలాంటి మిగులు భూమి లేదని స్పష్టంగా పేర్కొన్నారని చెప్పారు. ఆ ఆధారాలతో 2025 మే 13న జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేశాం. దింతో ఆ 18 గుంటల నమోదును రికార్డ్స్ నుంచి తొలగించారని తెలిపారు. అయితే, అనంతరం ల్యాండ్ సర్వే అధికారుల నివేదిక ఆధారంగా అదే నమోదును మళ్లీ పునరుద్ధరించడం జరిగిందని ఆరోపించారు. దీనిపై పలుమార్లు జిల్లా కలెక్టర్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, రాష్ట్రపతి, గవర్నర్, ముఖ్యమంత్రి తదితరులకు ఫిర్యాదులు చేశామన్నారు. దింతో ఇటీవల జిల్లా రెవెన్యూ, సర్వే, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించారని, విజిలెన్స్ ఆదేశాల మేరకు మరోసారి సర్వే కూడా జరిగినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రైతు నాయకులు మాట్లాడుతూ, లేని భూమిని రికార్డుల్లో నమోదు చేయడం ద్వారా ప్రభుత్వానికి నష్టం కలిగించేలా వ్యవహరించిన వ్యక్తులు, వారికి సహకరించిన అధికారులపై నిష్పాక్షిక విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అలాగే సర్వే నంబర్ 226లోని 18 గుంటల అక్రమ నమోదును శాశ్వతంగా తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో సింగిరెడ్డి రామచంద్రారెడ్డి, కోటిచింతల మురళీధర్ రావు, తాటికొండ అనిల్, భీం సేన్ గౌడిసేలా తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు

**ఆత్మకూరు, జూలై 6 (తెలంగాణ పత్రిక):**



భారతీయ జనతా పార్టీ ఆత్మకూరు మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతిని ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు ఉప్పుగళ్ల శ్రీకాంత్ రెడ్డి నేతృత్వంలో ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ దేశ సమైక్యతకు జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడని అన్నారు. "ఒక దేశం--ఒక రాజ్యాంగం--ఒక జెండా--ఒక ప్రధాని" అనే సిద్ధాంతంతో దేశ ఐక్యత కోసం పోరాడిన ఆయన ఆశయాలకు కొనసాగింపుగానే కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 370ను రద్దు చేసిందని పేర్కొన్నారు. సనాతన ధర్మ పరిరక్షణ, జాతీయ సమైక్యత, యువతలో దేశభక్తి పెంపొందించేందుకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. యువత ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధి కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు గట్టు వేణుగౌడ్, మాజీ మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం, ప్రముఖ న్యాయవాది మాజీ జెడ్పీటీసీ టింగిలికారి సత్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి బయ్య పైడి, కోశాధికారి జక్కుల మహేందర్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దేశ సమైక్యతకు జీవితాన్ని అంకితం చేసిన మహానేత

# డా.శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తి

-జల్లి శైలజ హరినాథ్, శ్రీశైలం యాదవ్, గౌరారం జగన్ గౌడ్

మేడ్చల్, జూలై 6 తెలంగాణ పత్రిక



భారతీయ జనతా పార్టీ సిద్ధాంతకర్త, జాతీయ సమైక్యతకు ప్రతీకగా నిలిచిన మహానేత డా.శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకుని మేడ్చల్ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షురాలు జల్లి శైలజ హరినాథ్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి దేశ సమైక్యత కోసం చేసిన సేవలను స్మరించుకున్నారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో జల్లి శైలజ హరినాథ్, ఎల్లంపేట మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్, మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు గౌరారం జగన్ గౌడ్ మాట్లాడుతూ, డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ దేశ సమగ్రత, జాతీయ ఐక్యత కోసం తన జీవితాన్నే అంకితం చేసిన మహోన్నత దేశభక్తుడని కొనియాడారు. "ఏక్ దేశ్ మే దో విధాన్, దో నిశాన్, దో ప్రధాన్ నహీ చలేగా" అనే నినాదంతో దేశ సమైక్యత కోసం నిరంతరం పోరాడిన ఆయన, జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని వ్యతిరేకిస్తూ దేశ సమగ్రత కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడని గుర్తు చేశారు. డా.శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఆశయాలు ప్రతి భారతీయుడికి ఆదర్శమని, యువత దేశభక్తి, సేవాభావంతో సమాజాభివృద్ధికి కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. దేశ సమైక్యత, జాతీయత భావనను బలోపేతం చేయడంలో ఆయన ఆలోచనలు నేటికీ మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు నందా రెడ్డి, మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ కోశాధికారి లవంగ శ్రీకాంత్, బీజేవైఎం రాష్ట్ర నాయకులు రాగం అర్జున్, జిల్లా నాయకులు బొజ్జ రాఘవ రెడ్డి, ఎల్లంపేట మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి మహేష్, మేడ్చల్ మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి కానుకంటి వంశీ విజయ్ వంజరి, జకట ప్రేమదాసు, మున్సిపాలిటీ ఉపాధ్యక్షులు మైసరి రాజు వంజరి, సర్వేశ్వర రెడ్డి, కార్యదర్శులు డి. సాయి, బండి విష్ణు, యువ మోర్చ నాయకులు శ్రీనివాస్ ముదిరాజ్, సీనియర్ నాయకులు ధాత్రిక లక్ష్మణ్ వంజరి, మహిళా మోర్చ నాయకులు పుష్ప మల్లారెడ్డి, తోట అనిత, సాదామణి నరేందర్, ఎన్.ఎస్. గౌడ్, రతన్ రాథోడ్, బొజ్జ వంశీ రెడ్డి, అర్జున్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలు చిరస్మరణీయం





-వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నాయకుల ఘన నివాళిలి

మేడ్చల్, జూలై 6 తెలంగాణ పత్రిక

భారత మాజీ ఉప ప్రధాని, అణగారిన వర్గాల అభ్యున్నతికి జీవితాంతం కృషి చేసిన మహానేత బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా మేడ్చల్ పట్టణంలోని అంబేద్కర్ భవన్ వద్ద, కిష్టాపూర్ గ్రామంలోని ఆయన విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రామ్ దేశ రాజకీయ, సామాజిక రంగాల్లో చెరగని ముద్ర వేసిన మహానేత అని కొనియాడారు. అట్టడుగు వర్గాల సంక్షేమం, సామాజిక సమానత్వం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం ఆయన జీవితాంతం అవిశ్రాంతంగా శ్రమించారని గుర్తు చేశారు. కేంద్ర మంత్రిగా, ఉప ప్రధానిగా ఆయన అందించిన సేవలు దేశ అభివృద్ధికి దోహదపడటమే కాకుండా, హరిత విప్లవం ద్వారా వ్యవసాయ రంగం బలోపేతానికి కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు. బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని సమసమాజ నిర్మాణానికి కృషి చేయాలని కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. ఆయన చూపిన మార్గంలో నడవడమే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నడికొప్పు నాగరాజు (చాపరాజు) ముదిరాజ్, 298 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రొయ్యపల్లి మల్లేష్ గౌడ్, మాజీ ఉప సర్పంచ్ మర్రి నర్సింహారెడ్డి, మాజీ మున్సిపల్ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు కౌడే మహేష్ కురుమ, వీరమల్ల శ్రావణ్ కుమార్ గుప్తా, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ఉదండపురం సత్యనారాయణ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు లవంగు రాకేష్ వంజరి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు దండు శ్రీకాంత్ (చింటు), సీనియర్ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ కార్యకర్తలు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# పనిచేయని నిఘా నేత్రాలు.. దొంగలకు వరం!







-సీసీ కెమెరాలు మూగబోవడంతో నేరస్తులకు స్వేచ్ఛ

-రెండు రోజుల్లో ద్విచక్ర వాహనం, ఆటో చోరీ.. ఆందోళనలో ప్రజలు

మేడ్చల్ జూలై 06 తెలంగాణ పత్రిక

ప్రజల భద్రత కోసం లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ప్రస్తుతం పనిచేయ కపోవడంతో అవి కేవలం అలంకార వస్తువులుగా మారిపోయాయని స్థానికులు విమర్శిస్తున్నారు. నేరాలను అరికట్టేందుకు, నేరస్తులను గుర్తించేందుకు అత్యంత కీలకమైన నిఘా వ్యవస్థ నిర్వీర్యం కావడంతో దొంగలు రెచ్చిపోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత రెండు రోజుల వ్యవధిలోనే ఒక ద్విచక్ర వాహనం, ఒక ఆటో చోరీకి గురికావడం పట్టణంలో భయాందోళనకు కారణమైంది. చోరీ జరిగిన తర్వాత దొంగలు ఏ మార్గంలో వెళ్లారు? ఎవరనే విషయాలను సీసీ కెమెరాల ద్వారా గుర్తించాలనుకుంటే, చాలా కెమెరాలు పనిచేయని పరిస్థితి బయటపడింది. దీంతో పోలీసుల దర్యాప్తుకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ప్రధాన కూడళ్లు, మార్కెట్ ప్రాంతాలు, కాలనీలు, రద్దీ రహదారుల్లో ఏర్పాటు చేసిన కెమెరాలకు సకాలంలో నిర్వహణ లేకపోవడంతో అవి ఒక్కొక్కటిగా పనిచేయకుండా పోతున్నాయని తెలుస్తోంది. నిర్వహణ లోపం కారణంగా ప్రభుత్వ నిధులు వృథా అవుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ప్రాణ, ఆస్తి భద్రతకు సీసీ కెమెరాలు కీలకమైన సాధనం. అవి సక్రమంగా పనిచేస్తే నేరాల నియంత్రణతో పాటు నేరస్తులను త్వరగా గుర్తించి చట్టం ముందు నిలబెట్టడం సులభమవుతుంది. అయితే ప్రస్తుతం నిఘా వ్యవస్థ నిర్వీర్యం కావడంతో దొంగలకు ఇది అనుకూలంగా మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పట్టణంలోని అన్ని సీసీ కెమెరాలను పరిశీలించి, పనిచేయని కెమెరాలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని, అవసరమైన చోట కొత్త కెమెరాలు ఏర్పాటు చేసి ప్రజల భద్రతను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

**స్థానికులు పానుగంటి కిరణ్**


ప్రజల భద్రత కోసం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయకపోవడం చాలా బాధాకరం. దొంగతనం జరిగిన తర్వాత ఫుటేజ్ చూసి నిందితులను గుర్తించే అవకాశం కూడా లేకుండా పోతోంది. అధికారులు వెంటనే కెమెరాలను మరమ్మతు చేసి నిఘా వ్యవస్థను పునరుద్ధరించాలి.

**స్థానికులు శివ**

"ఇటీవల వరుసగా చోరీలు జరగడంతో ప్రజల్లో భయం నెలకొంది. సీసీ కెమెరాలు పనిచేసి ఉంటే దొంగలను త్వరగా గుర్తించే అవకాశం ఉండేది. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని అన్ని కెమెరాలు సక్రమంగా పనిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి."

# గుర్తు తెలియని మృతుడి ఆచూకీ కోసం మేడ్చల్ పోలీసుల విజ్ఞప్తి

మేడ్చల్, జూలై 6 తెలంగాణ పత్రికలి



మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అత్వెల్లి సెయింట్ క్లారెట్ స్కూల్ సమీపంలో జూన్ 27, 2026 తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ గాంధీ ఆసుపత్రిలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు పురుషుడు కాగా, వయస్సు సుమారు 35 సంవత్సరాలు, ఎత్తు 5 అడుగుల 6 అంగుళాలు, చామనచాయ రంగు కలిగి ఉన్నట్లు వెల్లడించారు. ఈ వ్యక్తిని ఎవరైనా గుర్తించినా లేదా అతని కుటుంబ సభ్యులు, బంధువుల వివరాలు తెలిసినా వెంటనే మేడ్చల్ పోలీస్ స్టేషన్‌ను లేదా దర్యాప్తు అధికారి ఎస్‌ఐ కె. భానుచందర్ గౌడ్‌ను 8712571843, 8712663280 నంబర్లలో సంప్రదించాలని, అత్యవసర సేవల కోసం 100 లేదా 112కు సమాచారం అందించాలని మేడ్చల్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# గుండ్ల పోచంపల్లిలో ఘనంగా బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి వేడుకలు



మేడ్చల్, జూలై 6 తెలంగాణ పత్రిక

దళితుల ఆశాజ్యోతి, స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉప ప్రధాని, భారతరత్న బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుండ్ల పోచంపల్లి డివిజన్‌లో ఘనంగా నివాళులర్పించారు. గుండ్ల పోచంపల్లి పట్టణంలోని మినీ ట్యాంక్ బండ్ వద్ద ఏర్పాటు చేసిన బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి మాజీ సర్పంచ్, తెలంగాణ రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం మాజీ అధికార ప్రతినిధి, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గరిసెల సురేందర్ ముదిరాజ్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గుండ్ల పోచంపల్లి మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బేరి ఈశ్వర్, ఓబీసీ సెల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టికాడి విజయకుమార్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకుడు అమరం సురేష్ రెడ్డి, కావేరి శేఖర్ ముదిరాజ్, జిల్లా కాంగ్రెస్ నాయకుడు దొడ్ల మోహన్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, బాబూ జగ్జీవన్ రామ్ స్వాతంత్ర్య సమరయోధుడిగా, సామాజిక సమానత్వం కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. "భూమి దున్నేవాడికే భూమి" అనే నినాదంతో రైతులు, పేదల సంక్షేమం కోసం విశేషంగా పనిచేశారని గుర్తు చేశారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలనను మరింత బలోపేతం చేస్తూ, బాబూజీ ఆశయ సాధన కోసం కృషి చేస్తామని కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

## ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించిన.జిల్లారెవెన్యూ అధికారి రాజేశ్వరి

-అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

పెద్దపల్లి,ప్రతినిధి జూలై 06 ( తెలంగాణ పత్రిక )



అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.శ్రీరాంపూర్ మండలం మంగపేట గ్రామానికి చెందిన ఏ లక్ష్మి తమ గ్రామ నందు ఖాళీగా ఉన్న అంగన్వాడి ఆయా పోస్ట్ తమకు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా వారధి సొసైటీ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.ధర్మారం మండలం దొంగతుర్తి గ్రామానికి చెందిన మహంకాళి వీరమ్మ, గొట్టె లింగమ్మ సర్వేనెంబర్ 294 నందు ప్రభుత్వం తరఫున ఉమ్మడిగా బోర్వెల్ ఏర్పాటు చేయుట గురించి దరఖాస్తు చేసుకోగా ఈడీఎస్సీ కార్పొరేషన్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.మంథని పట్టణం రాఘవ ఉర్ల నగర్ కు చెందిన భీమనపల్లి సురేందర్ తన కుమార్తెకు ఏదైనా బిసి గురుకుల పాఠశాలలో 8వ తరగతి నందు సీటు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా గురుకుల పాఠశాల సొసైటీ అధికారుల కొరకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి బి. ప్రకాష్ , సంబంధిత జిల్లా అధికారులు, కలెక్టరేట్ డి.విభాగ పర్యవేక్షకులు ఈశ్వర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
నిజం మా విజన్



## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మేడ్చల్ జూలై 06 తెలంగాణ పత్రిక

మేడ్చల్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో 1971--1972 విద్యా సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ విద్యాభ్యాస కాలంలో పొందిన అనుభవాలను పంచుకుంటూ, గురువుల మార్గదర్శకత తమ జీవితాల్లో ఎంతగానో ఉపయోగపడిందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు మల్లారెడ్డి ని ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయుటకు సహకరించిన వేముల సీతారాం రెడ్డి,గల్వ పాపారావు ,కొమరవెల్లి బద్రి నారాయణ లకు తమ స్నేహితులు కృతజ్ఞతలు తెలిపారు.

## అంగన్వాడి సెంటర్ ను తనిఖీ చేసిన సిడిపిఓ నందిని



కోటగిరి తెలంగాణ పత్రిక జూలై 6.

కోటగిరి మండల కేంద్రంలోని ఐసిడిఎస్ ఇంచార్జ్ సిడిపిఓ నందిని బీసీ కాలనీ, మాలివాడ అంగన్వాడి కేంద్రాలను ఆకస్మితంగా తనిఖీ చేశారు. కేంద్రంలోని పిల్లల హాజరు పట్టికలు పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె పిల్లల తల్లులతో మాట్లాడుతూ.... ప్రతినిత్యం పిల్లలను అంగన్వాడి సెంటర్ కు పంపించాలన్నారు. అంగన్వాడి కేంద్రం నందు పౌష్టికాహారాన్ని అందించడం జరుగుతుందన్నారు. బాలామృతం పాలు గుడ్లు గర్భిణీ స్త్రీలకు భోజన సౌకర్యాలు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఆమె వెంట అంగన్వాడి సూపర్వైజర్ కొమరవ్వ అంగన్వాడి సెంటర్ టీచర్ పిల్లల తల్లులు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక న్యాయానికి చిరునామా బాబు జగ్జీవన్ రామ్ మహానేతకు ఘన నివాళులు అర్పించిన డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్



ఆళ్లపల్లి// తెలంగాణ పత్రిక ప్రతినిధి// జూలై 6

సామాజిక సమానత్వానికి ప్రతీకగా నిలిచిన స్వర్గీయ డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతిని ఖమ్మంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, అణగారిన వర్గాల హక్కుల కోసం బాబు జగ్జీవన్ రామ్ చేసిన సేవలు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. ఆయన ఆశయాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిగా నిలవాలని, సమాన సమాజ నిర్మాణానికి వాటిని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో ప్రజావాణిలో వినతిపత్రం

**-డబుల్ బెడ్ రూమ్ కాలనీలో గల సమస్యల గురించి వినతి పత్రం అందజేసిన కాలనీవాసులు**

జగిత్యాల పట్టణం (తెలంగాణ పత్రిక) జూలై 6



జగిత్యాల అర్బన్ డబుల్ బెడ్రూమ్ కాలనీలో నివసిస్తున్న యజమానులను ఎంక్వయిరీల పేరుతో భయాందోళనలకు గురి చేస్తున్నారు.ప్రభుత్వం కనీస అవసరాలను సమకూర్చకుండా, ఇండ్లు కేటాయించడం వలన వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.లబ్దిదారులు కూలిపనులు చేసుకునేవారు, చిరు వ్యాపారాలు, ప్రైవేటు గుమస్తా ఉద్యోగాలు చేసుకునేవారు ఉపాధి నిమిత్తం జగిత్యాల పట్టణానికి వచ్చి వెళ్లడానికి రవాణా సౌకర్యం లేకపోవడం వలన ఆర్థికంగా నష్టపోతున్నారు.అక్కడ నివసిస్తున్నా వారికి ఉన్న ప్రధాన సమస్యలు. చౌరస్తాలో ఐమాక్స్ లైట్స్ నెలకొల్పడం,మున్సిపల్ సిబ్బందిని కేటాయించడం, మంచినీటి సరఫరా, అసాంఘిక కార్యకలాపాలకు ఆస్కారం లేకుండా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయడం, రేషన్ దుకాణం ఏర్పాటు చేయుట, సెల్ టవర్ ఏర్పాటు చేయుట, ప్రభుత్వ పాఠశాలను ప్రారంభించడం, అంగన్వాడి కేంద్రం ఏర్పాటు చేసి స్థానికులకు ఉద్యోగ అవకాశం కల్పించడం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రమును ఏర్పాటు చేయడం, డంపింగ్ యార్డ్ తరలించడం, స్మశాన వాటికల ఏర్పాటు,వంటి సమస్యల పరిష్కారం కోసం వినతి పత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు మనల కిషన్ ,ప్రధాన కార్యదర్శి పాడాల శ్రీనివాస్,శివ మహారాజ్, గొల్లపల్లి శ్రీకాంత్, సిరిపురం జితేందర్ చేనీ అనిల్ ,అశోక్, అర్బన్ కాలనీ వెల్ఫర్ అసోసియేషన్ అధ్యక్షుడు స్వామి,ఉపాధ్యక్షురాలు కంటే విజయ,పన్నీరు శేఖర్, లక్ష్మీనారాయణ తదితురులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ కోసం తవ్విన రోడ్డు.. ఏడాదిగా నరకయాతన

**-ప్రమాదాలకు నిలయంగా మారిన ప్రధాన రహదారి**

**-ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు**

మేడ్చల్, జూలై 06 తెలంగాణ పత్రికలి






సెంట్రల్ డ్రైనేజీ నిర్మాణ పనుల కోసం తవ్విన రహదారిని ఏడాది గడిచినా పునరుద్ధరించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలోని కీలక ప్రభుత్వ కార్యాలయాలకు, రైల్వే స్టేషన్‌కు, పలు గ్రామాలకు అనుసంధానంగా ఉన్న ఈ ప్రధాన రహదారి ప్రస్తుతం భారీ గుంతలు, బురదతో ప్రమాదకరంగా మారింది. ఈ రహదారి ద్వారా ప్రతిరోజూ ఎమ్మార్వో కార్యాలయం, సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం, ప్రభుత్వ గ్రంథాలయం, రైల్వే స్టేషన్‌తో పాటు సమీప గ్రామాలకు వెళ్లే వేలాది మంది ప్రజలు ప్రయాణిస్తున్నారు. అయితే డ్రైనేజీ పనుల కోసం తవ్విన అనంతరం రోడ్డును పునరుద్ధరించక పోవడంతో వర్షం కురిసిన ప్రతిసారీ గుంతల్లో నీరు నిలిచి బురదమయంగా మారుతోంది. దీంతో ద్విచక్ర వాహనదారులు జారి పడుతూ గాయాల పాలవుతుండగా, ఆటోలు, ఇతర వాహనాల రాకపోకలు కూడా తీవ్రంగా ఇబ్బందికరంగా మారాయి. స్థానికులు పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ రహదారిపై అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సమస్య మరింత తీవ్రమవుతోందని, ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే రహదారి పునరుద్ధరణ పనులు చేపట్టి ప్రజల ఇబ్బందులను తొలగించాలని స్థానికులు, వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించాలి

**-టీయూడబ్ల్యూజే మండల అధ్యక్షులు షేక్ మౌలాలి**

వేములపల్లి, జూలై 06 (తెలంగాణ పత్రిక):-






నల్లగొండ జిల్లాలో జర్నలిస్టుల కుటుంబ సభ్యుల పిల్లలకు పాఠశాల విద్య కోసం ఫీజు రాయితీ సర్క్యులర్ జారీ చేయడంలో విద్యాశాఖ నిర్లక్ష్యన్ని నిరసిస్తూసోమవారంమండలకేంద్రంలోనితహశీల్దార్, మండలవిద్యాధికారి కార్యాలయాలలోటి యుడబ్ల్యూజె - ఐజేయు మండల అధ్యక్షుడు షేక్ మౌలాలి ఆధ్వర్యంలో వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మౌలాలిమాట్లాడుతూ టియుడ బ్ల్యూజె-ఐజేయు ఆధ్వర్యంలోరాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా నల్లగొండ జిల్లాకలెక్టరేట్, లో డిఆర్ఓకు, జిల్లా విద్యాశాఖ అధికారికి జూన్ 5న వినతి పత్రంఇవ్వడంజరిగిందన్నారు. పాఠశాలలు ప్రారంభమై 20 రోజులు గడుస్తున్నప్పటికీ ఫీజు రాయితీ సర్క్యులర్ ఇవ్వడంలో జిల్లా విద్యాశాఖ కాలయాపన చేస్తుదన్నారు. రాష్ట్రంలోని అనేక జిల్లాలలో జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలలో 75శాతం రాయితీ కల్పించేందుకు సర్క్యులర్ ఇవ్వగా, నల్లగొండ జిల్లాలో మాత్రం కమిషనరేట్ నుంచి అనుమతి రావాలంటూ జిల్లా విద్యాశాఖఅధికారులుపేర్కొనడం సమంజసం కాదన్నారు. సర్క్యులర్ జారీ అయ్యేవరకు టియుడబ్ల్యూజే -ఐజేయు ఆధ్వర్యం లో దశలవారిగా ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామనిఅయన స్పష్టంచేశారు.ఈకార్యక్రమంలో టుటియుడబ్ల్యూజే మాడ్గులపల్లి మండల అధ్యక్షుడు షేక్ రసూల్, జిల్లా కమిటీ సభ్యుడు ద్రైద వెంకటేశ్వర్లు,వేములపల్లి మండల కమిటీ ఉపాధ్యక్షుడు వంగాల వెంకటేష్, ప్రధాన కార్యదర్శి తండు వెంకన్న గౌడ్, కోశాధికారి ముండ్ల కళ్యాణ్ యాదవ్, జర్నలిస్టు షేక్ అబ్జాల్, ముండ్ల లింగయ్య యాదవ్,తోపాటు కట్టా ఆనంతారెడ్డి, గాదె వెంకట్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఉప ప్రధాని దివంగత బాబు జగ్జీవన్ రామ్ గారి 78వ వర్ధంతి

**-ములుగు జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి సల్లూరి సతీష్. చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించిన**

**-ములుగు జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి బలుసు పాటి నరసయ్య..,**

**-వాజేడు మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు ములకల ప్రశాంత్,**

వాజేడు తెలంగాణ పత్రిక జూలై 6.



వాజేడు మండల కేంద్రంలో ని అయ్యవారిపేట గ్రామ పరిధిలో అంబేద్కర్ సెంటర్ లో మాజీ ఉప ప్రధాని దివంగత బాబు జగజీవన్ రామ్ గారి 78వ వర్ధంతి చిత్రపటానికి పూలమాల ఏసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాబు జగజీవన్ రామ్ గారి వర్ధంతి నిర్వహించటం నాకు చాలా సంతోషంగా ఉన్నదని, అలాగే ఆయన 1986న మరణించారు. సామాజిక న్యాయం, దళితుల హక్కులు, మరియు భారత రాజకీయాలు ఆయన చేసిన సేవలు ఎన్నో ఉన్నాయని. ఎమ్మార్పీఎస్ నాయకులు గుగ్గిల నరేంద్రబాబు గుర్తు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి బాబు జగ్జీవన్ రామ్ గారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించి నా. గోగు నరసింహారావు , వార్డు మెంబర్. కుమ్మరి శ్రీకాంత్ ,నాయకులు గ్రామ పెద్దలు ఈ కార్యక్రమాలు పాల్గొనడం జరిగింది.

# శంషాబాద్ కూరగాయల మార్కెట్ అధ్యక్షుడిగా చలివేంద్ర కృష్ణారెడ్డి

రాజేంద్రనగర్ ప్రతినిధి జూలై 06 తెలంగాణ పత్రిక.



రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పట్టణంలోని కూరగాయల మార్కెట్ (బి) సెక్షన్ నూతన కమిటీ ఎన్నిక సోమవారం రోజున మార్కెట్ ప్రాంగణంలో నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన చలివేంద్ర కృష్ణారెడ్డి,ఉపాధ్యక్షుడుగా మెరుగు కుమార్,ప్రధాన కార్యదర్శి జి.సత్యనారాయణ రెడ్డి.అదనపు కార్యదర్శిగా రాముడి రంగారెడ్డి.కోశాధికారిగా మల్చలం సురేష్,ఈ సందర్భంగా ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులకు మార్కెట్ ఓనర్స్ అసోసియేషన్ తరపున శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ మార్కెట్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని మార్కెట్ ఓనర్స్ అసోసియేషన్ తరపున సమస్యల పరిష్కారానికి ముందుండి తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తానని, మార్కెట్ కు తమ పండించిన పంటలను తీసుకొచ్చే రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా, రైతులు తీసుకువచ్చే కూరగాయలకు గిట్టుబాటు ధర కల్పించి తూకంలో ఎలాంటి మోసాలకు తావు లేకుండా చూస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు.

# నూతన పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర డీజీపీ







**-ప్రజలకు మెరుగైన పోలీసు సేవలందించడమే లక్ష్యం డీజీపీ సి.వి. ఆనంద్.**

**భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక జూలై 6**

జిల్లాలో శాంతిభద్రతలను మరింత పటిష్టం చేయడంతో పాటు ప్రజలకు ఆధునిక సౌకర్యాలతో కూడిన మెరుగైన పోలీసు సేవలు అందించాలనే లక్ష్యంతో మణుగూరులో నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్‌ను తెలంగాణ రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ రోహిత్ రాజు, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, పోలీసు శాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సీసీటీవీ మానిటరింగ్ సెల్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ సి.వి. ఆనంద్ మాట్లాడుతూ, సింగరేణి సంస్థ సహకారంతో నూతన పోలీస్ స్టేషన్ నిర్మాణం పూర్తయిందని, ప్రజలకు మరింత మెరుగైన, వేగవంతమైన పోలీసు సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులు, హక్కుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలో నేరాల నియంత్రణతో పాటు అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతూ సమర్థవంతంగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా పోలీసు సేవలను మరింత సమర్థవంతంగా అందించగలుగుతున్నామని డీజీపీ తెలిపారు. నేరాల నియంత్రణ, దర్యాప్తు, సీసీటీవీ నిఘా, సైబర్ నేరాల విచారణ వంటి అంశాల్లో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోందన్నారు. మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా సమాజాన్ని వినాశన దిశగా నడిపిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. భావితరాలను ఈ ప్రమాదం నుంచి కాపాడేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. ఇందులో భాగంగా ఈగల్ (ఈగల్) వంటి ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేసి, కింది స్థాయి సిబ్బంది నుంచి ఉన్నతాధికారుల వరకు సమన్వయంతో మాదకద్రవ్యాల నిర్మూలన కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. సైబర్ నేరాలు, ట్రాఫిక్ రహదారి ప్రమాదాల నివారణపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా చేసే ముఠాలను తీవ్రవాదుల మాదిరిగానే పరిగణిస్తూ కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ అంకిత్ నూతన పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సీసీటీవీ మానిటరింగ్ సెల్‌ను ప్రారంభించి, పోలీస్ స్టేషన్‌లో కల్పించిన ఆధునిక మౌలిక సదుపాయాలను పరిశీలించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు సత్వర, పారదర్శక పోలీసు సేవలందించడంలో జిల్లా యంత్రాంగం పోలీసు శాఖతో సమన్వయంగా పనిచేస్తోందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా నేరాల నియంత్రణతో పాటు ప్రజలకు మరింత నాణ్యమైన సేవలు అందించేందుకు ఈ నూతన పోలీస్ స్టేషన్ దోహదపడుతుందని పేర్కొన్నారు. అనంతరం డీజీపీ, ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీతో కలిసి పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాలను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. ప్రజలకు స్నేహపూర్వక, పారదర్శక, జవాబుదారీతనంతో కూడిన పోలీసు సేవలు అందించాలని పోలీసు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు శాఖ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, సింగరేణి సంస్థ ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఆత్మకూరు మండల ఉపసర్పంచుల ఫోరం నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**-అధ్యక్షులు ఓరుగంటి కరుణాకర్ రెడ్డి**

**-గ్రామాభివృద్ధికి సమష్టిగా కృషి చేస్తామని సంకల్పం**

**ఆత్మకూరు, జూలై 6: (తెలంగాణ పత్రిక):**



ఆత్మకూరు మండల ఉపసర్పంచుల ఫోరం నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని ఉపసర్పంచుల సమక్షంలో జరిగిన సమావేశంలో ఫోరం అధ్యక్షుడిగా ఓరుగంటి కరుణాకర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా మాదాసి ఏలియా, ప్రధాన కార్యదర్శిగా కిన్నర ప్రేమ్ చంద్, కార్యదర్శిగా రాజులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల కార్తీక్, జిల్లా అధ్యక్షుడు అంబాల అనిల్ కుమార్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఉపసర్పంచులు గ్రామ పాలనలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సమస్యల పరిష్కారానికి ఫోరం వేదికగా పనిచేస్తుందని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి, స్థానిక సంస్థల బలోపేతం, ఉపసర్పంచుల హక్కుల పరిరక్షణ కోసం అందరూ ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. నూతన అధ్యక్షుడు ఓరుగంటి కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ, మండలంలోని అన్ని గ్రామాల ఉపసర్పంచులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు గ్రామాల అభివృద్ధికి సమిష్టిగా కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఆత్మకూరు మండలంలోని అన్ని గ్రామాల ఉపసర్పంచులు పాల్గొని నూతన కమిటీ ఎన్నికను స్వాగతిస్తూ తమ పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

# ఔట్‌సోర్సింగ్ ఏఎన్ఎమ్‌లకు సబ్ సెంటర్ల కేటాయింపునకు కౌన్సెలింగ్ నిర్వహణ

**-జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. తుకారాం రాథోడ్.**

**భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక జూలై 6**



తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల ప్రక్రియలో భాగంగా జిల్లాలోని పలు ఆరోగ్య ఉప కేంద్రాల్లో రెగ్యులర్ ఏఎన్ఎమ్‌లు విధుల్లో చేరిన నేపథ్యంలో, ఖాళీగా ఉన్న ఉప కేంద్రాలకు ఔట్‌సోర్సింగ్ ఏఎన్ఎమ్‌లను కేటాయించేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. తుకారాం రాథోడ్ మాట్లాడుతూ, కౌన్సెలింగ్ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, సీనియారిటీ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి ఉప కేంద్రంలో ప్రజలకు నాణ్యమైన ప్రాథమిక ఆరోగ్య సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. నూతనంగా కేటాయించిన ఉప కేంద్రాల్లో ఔట్‌సోర్సింగ్ ఏఎన్ఎమ్‌లు వెంటనే విధుల్లో చేరి, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, శిశువులు, చిన్నారులకు అవసరమైన ఆరోగ్య సేవలు, టీకాల కార్యక్రమాలు, కుటుంబ నియంత్రణ సేవలు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. జిల్లాలోని ప్రతి ఆరోగ్య ఉప కేంద్రంలో ప్రజలకు ఎలాంటి అంతరాయం లేకుండా వైద్య సేవలు అందేలా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అన్ని చర్యలు తీసుకుంటుందని డా. తుకారాం రాథోడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ సూపర్డెంట్ డిప్యూటీడెమో నాగలక్ష్మి డిపిఎంవోమోహన్, హెల్త్ సూపర్వైజర్లు శ్రీనివాసరావు, రాంప్రసాద్, జానకి సుశీల ఉమాదేవి విజయలక్ష్మి యూనియన్ నాయకులు పాల్గొన్నారు

# బాబూ జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయం

**-నంగునూరు ఏఎంసీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి**

**నంగునూరు, జూలై 6(తెలంగాణ పత్రిక):**



స్వాతంత్ర్య సమరయోధుడు, భారత మాజీ ఉప ప్రధానమంత్రి బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా నంగునూరులో ఆయనకు ఘన నివాళులు అర్పించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ దేవులపల్లి యాదగిరి బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి సోమవారం పూలమాల వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా దేవులపల్లి యాదగిరి మాట్లాడుతూ, అణగారిన వర్గాల అభ్యున్నతి, సామాజిక సమానత్వం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం బాబూ జగ్జీవన్ రామ్ జీవితాంతం చేసిన కృషి భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొని దేశ నిర్మాణంలో విశేష సేవలందించిన ఆయన, ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం కోసం అంకితభావంతో పనిచేసిన మహనీయుడిగా దేశ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేయడంలో, అణగారిన వర్గాల అభివృద్ధికి బాబూ జగ్జీవన్ రామ్ చూపిన మార్గం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు అచ్చిన సత్తయ్య, దేవులపల్లి రాజమౌళి, విక్రమ్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ గాండ్ల రమేశ్, బాగు శ్రీకాంత్ యాదవ్, పంగ రాజశేఖర రెడ్డి, చేర్యాల బాలయ్య, ఎండి ఎజాస్, నాగరాజుపల్లి సర్పంచ్ ముక్కెర లింగం, కందికట్ల రాజు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొని బాబూ జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళు లర్పించారు.

## హెచ్ఎండిఏ ఆధ్వర్యంలో రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్ ప్రతినిధి జూలై 06 తెలంగాణ పత్రిక.**

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ ( హెచ్ఎండిఏ ) ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని శంషాబాద్ మండలంలో సిసి (సీసీ ) మరియు బిటి (బీటీ ) రోడ్ల నిర్మాణ పనులకు సోమవారం నాడు ఘనంగా శంకుస్థాపన జరిగింది. సుమారు రూ. 7.50 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ పనులకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ శంకుస్థాపన చేశారు. కాచారం, చౌదర్ గూడ, పాల్మకూల్ గ్రామాలలో చేపట్టనున్న సిసి రోడ్లు, బీటీ రోడ్ల పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ సర్పంచులు కట్కూరి కోటేశ్వర్ గౌడ్, గోపాల్, మల్చలం లక్ష్మీ లింగం, సీనియర్ నాయకులు కే చంద్ర రెడ్డి, మాజీ జెడ్పిటిసి నీరటి తన్వి రాజు,ప్రజాప్రతినిధులు హెచ్ఎండిఏ అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారుల్లో గందరగోళం

**జగిత్యాల పట్టణం (తెలంగాణ పత్రిక) జూలై 6**



జగిత్యాల పట్టణ పరిదిలో గల ఇండ్లు లేని నిరుపేదలకు నూకపెల్లి డబుల్ బెడ్రూంలలో దాదాపు 4300 మంది కి ఇండ్లను కేటాయించి దాదాపు 3 సం,,లు కావస్తుంది,ఇప్పుడు లబ్దిదారులను ప్రతిరోజు కొంత మందికి ఫోన్ చేసి పిలిపించి మున్సిపాలిటీ అదికారులు ఒక పత్రం మీద సంతకం పెట్టాలని, ఫోన్లకు లింకు అయిన ఆదార్ కార్డ్ వివరాలు తీస్కొని ఆన్లైన్ చేస్తున్నారు అని లబ్దిదారులు చెప్పటం జరిగింది. ఇప్పటి వరకు ఏదైతే పత్రం మీద సంతకం తీసుకుంటున్నారో అది పూర్తిగా ఇంగ్లీష్ లో ఉండటంతో అందులో ఏమి సమాచారం ఉందో తెలియకుండానే సంతకం చేస్తున్నారు. ఎందుకంటే, మా ఇల్లు ఎక్కడ తీసుకుంటారో,రద్దు చేస్తారో అని ఆందోళనతో సంతకం చేస్తున్నారు కావున, పత్రంలో పొందుపర్చిన సమాచారం తెలుగులో ముద్రించి, పూర్తి సమాచారాన్ని పత్రికల ద్వారా విడుదల చేసినట్లు అయితే భయాందోళనలకు గురికాక పోయేవారు.ప్రదానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద నిదుల విడుదల కొరకు తీసుకుంటున్నట్లు కమీషనర్ చెప్పారు.అందులో పొందుపర్చిన అంశాలు వారికి అర్థం కాక భయాందోళనకు గురిచేసే విధంగా ఉన్నాయి. సమాచారాన్ని వివరిస్తూ ఇండ్లను రద్దు చేయమని వారికి భరోసాను కల్పించి ప్రతి వార్డు లో మున్సిపల్ ఆటోల ద్వారా మైక్ లో అనౌన్స్ చేస్తూ, పేపరు ప్రకటన ద్వార లబ్దిదారుల వరకు చేరే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు మీ మీద పెట్టుకున్న నమ్మకాన్ని బలపరుస్తూ లబ్దిదారులలో విశ్వాసాన్ని కల్పిస్తూ వెంటనే చర్యలు తీసుకోవాలని లబ్దిదారుల తరపున విజ్ఞప్తి మాజీ కౌన్సిలర్ హనుమాండ్ల జయశ్రీ విజ్ఞప్తి చేశారు.

## సీసీటీవీ కోర్స్ పూర్తి చేసుకున్న అభ్యర్థుల కోర్సు ముగింపు కార్యక్రమం



**జగిత్యాల పట్టణం (తెలంగాణ పత్రిక) జూలై 6**

జగిత్యాల పట్టణంలోని రఘురాములకోట చౌరస్తా దగ్గర యూనియన్ బ్యాంక్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో సీసీటీవీ 14 రోజుల శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థుల శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అభ్యర్థులు మాట్లాడుతూ 14 రోజుల సీసీటీవీ శిక్షణ కార్యక్రమం తమలో ఒక ఆత్మవిశ్వాసం పొందేలా చేసిందని,అలాగే తమకు స్కిల్ లో నైపుణ్యం ఏర్పడిందని భవిష్యత్తులో ఈ శిక్షణ తమకు ఎంతగానో ఉపయోగపడుతుందని, ఈ రోజుల్లో ప్రతి చోట సీసీటీవీ అనేది ఖచ్చితమైన సాధనంలా ఉంది కాబట్టి భవిష్యత్తు లో సీసీటీవీ శిక్షణ తమకు ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ అధికారులు, ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ బాపు, సీసీటీవీ ట్రైనర్ శ్యామ్, అధ్యాపక బృందం, శిక్షణ పొందిన అభ్యర్థులు పాల్గొన్నారు.

# నంగునూరులో రైతులకు ఉచిత పత్తి విత్తనాల పంపిణీ





**-పత్తి ఉత్పాదక మిషన్ కింద పూర్తి సబ్సిడీపై పంపిణీ**
**-శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేసి అధిక దిగుబడులు సాధించాలని సూచన**


**నంగునూరు, జూలై 6(తెలంగాణ పత్రిక):**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పత్తి ఉత్పాదక మిషన్ కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలో సోమవారం అర్హులైన రైతులకు పూర్తి సబ్సిడీపై పత్తి విత్తనాలను పంపిణీ చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) ఛైర్మన్ దేవులపల్లి యాదగిరి, మండల వ్యవసాయ అధికారి (ఏవో) గీత రైతులకు విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విత్తనాలను సద్వినియోగం చేసుకొని శాస్త్రీయ పద్ధతుల్లో పత్తి సాగు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. పంట సాగు నుంచి నిర్వహణ వరకు వ్యవసాయ శాఖ అధికారులు సూచించే సలహాలను పాటించాలని రైతులకు సూచించారు. రైతుల ఆదాయం పెంపు, నాణ్యమైన దిగుబడుల సాధన లక్ష్యంగా ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. రైతులు వాటిని వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అచ్చిన సత్తయ్య, విక్రమ్ రెడ్డి, పంగ రాజశేఖర రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గాండ్ల రమేశ్, యువజన కాంగ్రెస్ నాయకుడు బాగు శ్రీకాంత్ యాదవ్, చేర్యాల బాలయ్య, మైనార్టీ సెల్ నాయకుడు ఎండి ఎజాస్, నాగరాజుపల్లి సర్పంచ్ ముక్కెర లింగం, కందికట్ల రాజు, వ్యవసాయ శాఖ సిబ్బంది, గ్రామ రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# చేతిరాత నోట్‌తో కలకలం

**-ఫర్టిలైజర్ దుకాణాల్లో అవకతవకలపై ఆరోపణలు**
**-చూసీ చూడనట్లు వదిలేసేందుకు మామూళ్ల పర్వమా..?**
**-జిల్లా స్థాయి విచారణకు రైతు సంఘాల డిమాండ్**

**పాలకుర్తి/తొర్రూరు(తెలంగాణ పత్రిక) ప్రతినిధి పున్నం సారయ్య :**






తొర్రూరు ప్రాంతంలో ఫర్టిలైజర్ దుకాణాల నిర్వహణ,నిబంధనల అమలుపై తీవ్ర అనుమానాలకు తావిస్తున్న ఓ చేతిరాత నోట్ ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారి చర్చనీయాంశంగా నిలిచింది. ఎరువుల వ్యాపారుల నుంచి వివిధ పేర్లతో నగదు వసూళ్ల జరిగినట్లు ఆ నోట్‌లో నమోదై ఉండటంతో వ్యవసాయ శాఖ పనితీరుపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారంలో ఉన్న ఆ చేతిరాత నోట్‌లో ఫర్టిలైజర్ డీలర్ల నుంచి వివిధ అధికారులకు, ఇతర వర్గాలకు నగదు చెల్లింపులు జరిగినట్లు పేర్కొన్నట్లు ప్రచారం సాగుతోంది. వ్యవసాయ శాఖకు చెందిన కొందరు అధికారులు దసరా మామూళ్లు తీసుకున్నారని ఓ చేతిరాత సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. వైరల్ అవుతున్న చేతిరాత నోట్‌లో 2025 అక్టోబర్ నెలకు సంబంధించిన లావాదేవీలు నమోదు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. అందులో కొంతమంది అధికారుల పేర్లు, వారి హోదాలు, చెల్లించిన మొత్తాలు స్పష్టంగా పేర్కొన్నట్లు సమాచారం. అయితే ఈ నోట్ అసలుదనంపై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి నిర్ధారణ వెలువడలేదు. అయినప్పటికీ ఈ వ్యవహారం ప్రజల్లో అనేక అనుమానాలను రేకెత్తిస్తోంది.

**రైతు సంఘాల ఆందోళన**

వ్యవసాయ రంగంలో పారదర్శకత ఉండాల్సిన సమయంలో ఇలాంటి ఆరోపణలు వెలుగులోకి రావడం ఆందోళనకరమని రైతు సంఘాల నాయకులు అభిప్రాయపడుతున్నారు.

**సమగ్ర దర్యాప్తు చేపట్టాలి**

ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి స్వతంత్ర విచారణ చేపట్టాలని రైతు సంఘాలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. వైరల్ అవుతున్న చేతిరాత నోట్ అసలుదనాన్ని నిర్ధారించడంతో పాటు, అందులో పేర్కొన్న అంశాలపై లోతైన విచారణ జరపాలని కోరుతున్నారు.


**చేతిరాత నోట్ లో రాసింది తప్పు**

ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ...ఈరోజు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న చేతిరాత నోట్ లో రాసింది తప్పు అని ఏవో ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫాంల పంపిణీ ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలి

**-రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి.**

**నిర్మల్ జిల్లా ప్రతినిధి జూలై 06 (తెలంగాణ పత్రిక)**







ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ఎన్యుమరేషన్ ఫాం ల పంపిణీ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి, ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి ఎన్యుమరేషన్ ఫాంల పంపిణీ, డిజిటలైజేషన్ పై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గడువులోగా ఎన్యుమరేషన్ ఫాంల పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాల వారీగా ఇప్పటివరకు పూర్తి చేసిన ఎన్యుమరేషన్ ఫాంల పంపిణీ వివరాలు సమీక్షించారు. బూత్ లెవెల్ అధికారులు (బిఎల్ఓలు) తప్పనిసరిగా ఇంటింటికీ వెళ్లి ఫాం లు అందివ్వాలని అన్నారు. బిఎల్ఓ లు మాత్రమే ఫాంలు పంపిణీ చేయాలని, బిఎల్ఎ లు గానీ, ఇతర రాజకీయ పార్టీల వారికి గానీ ఎన్యుమరేషన్ ఫాం లు పంపిణీ చేసే అధికారం లేదని స్పష్టం చేశారు. ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై సందేహాలు నివృత్తి చేయడానికి అవసరమైతే అదనపు హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ఎప్పటికప్పుడు వివిధ మీడియా మాధ్యమాలు, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం కల్పించాలని పేర్కొన్నారు. కలెక్టరేట్లోని సమావేశ మందిరం నుంచి ఈ వీసీలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. వీసీలో భాగంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఎన్యుమరేషన్ ఫాంల పంపిణీ ప్రక్రియ పూర్తయిందన్నారు. అన్ని నియమాలు పాటిస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్వహిస్తామని వివరించారు. డిజిటలైజేషన్ ప్రక్రియను కూడా త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. ఎప్పటికప్పుడు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ వీసీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, ఆర్డీఓ దేవీదాస్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండాలి

**-జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.**

**నిర్మల్ జిల్లా ప్రతినిధి జులై 06 (తెలంగాణ పత్రిక)**



ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ, ఉద్యోగులందరూ తప్పనిసరిగా ప్రతి రోజూ ముఖ గుర్తింపు హాజరు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## భూముల రీ సర్వే పై రైతులకు అవగాహన



**కోటగిరి తెలంగాణ పత్రిక జూలై 6.**

కోటగిరి మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా భూముల రిసర్వేపై రైతులకు జిల్లా రెవిన్యూ అధికారులు మండల తహసిల్దార్ గంగాధర్ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.... గ్రామాలలో భూముల వద్ద ప్రధాన సమస్యలు రెండు ఉంటాయన్నారు పొలం గట్టు సరిహద్దులు గ్రామాల సరిహద్దులు వాటి పరిష్కారం భూభారతి సర్వేల ద్వారా పరిష్కారం జరుగుతుందన్నారు. గ్రామాలలో అధికారులు వచ్చినప్పుడు రైతులు సర్వేకు సహకరించాలన్నారు. 90 సంవత్సరాల అనంతరం భూముల సర్వేను ఇప్పుడు చేపట్టడం జరుగుతుందన్నారు. ఆయన వెంట రెవిన్యూ అధికారులు జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ తహసిల్దార్ గంగాధర్ కోటగిరి పోతంగల్ సర్వేర్లు శ్రీనివాస్ రాథోడ్ పోశెట్టి సర్వే స్థానిక సర్పంచ్ ఇరవంతరావు పటేల్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక వేలంలో భారీ పోటీ... క్యూబిక్ మీటరుకు రూ.920 ధర

**-ఏడుగురి పోటీలో కొత్తూరి శ్రీనివాస్‌కు దక్కిన వేలం**




**పాపన్నపేట, జూలై 06: (తెలంగాణ పత్రిక):**

ప్రభుత్వ నిబంధనల మేరకు కార్యాలయ ప్రకటన ప్రకారం కుర్తివాడ శివారులోని 300 క్యూబిక్ మీటర్ల ఇసుకను సోమవారం కుర్తివాడ గ్రామపంచాయతీ కార్యాలయంలో బహిరంగ వేలం ద్వారా విక్రయించారు. ఈ వేలంలో మొత్తం ఏడుగురు ఆసక్తి గల వ్యక్తులు పాల్గొన్నారు. పోటీగా సాగిన వేలంలో కుర్తివాడ గ్రామానికి చెందిన కొత్తూరి శ్రీనివాస్ అత్యధికంగా క్యూబిక్ మీటరుకు రూ.920 ధరను కోట్ చేసి, మొత్తం 300 క్యూబిక్ మీటర్ల ఇసుకను దక్కించుకున్నారు. ఈ విషయాన్ని పాపన్నపేట తహసీల్దారు సతీష్ అధికారికంగా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శరత్, కుర్తివాడ జిపిఓ రాజు, పోలీసు అధికారులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యలపై నిర్లక్ష్యం వద్దు.. తక్షణమే పరిష్కరించండి: ఆర్డీవో శ్రీదేవి




**చండూరు, తెలంగాణ పత్రిక జూలై 6**

చండూర్ డివిజన్ కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి ఐదు భూ సమస్యల దరఖాస్తులు అందినట్లు ఆర్డీవో శ్రీదేవి తెలిపారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు తమ భూ సమస్యలపై ఆర్డీవోకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులు త్వరితగతిన పరిశీలించి, చట్టపరిధిలో వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. బాధితులకు న్యాయం జరిగేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు.అదేవిధంగా ప్రస్తుతం నియోజకవర్గ వ్యాప్తంగా జరుగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (రాూ=) ప్రక్రియపై అధికారులతో ఆర్డీవో సమీక్ష నిర్వహించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా, జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా పకడ్బందీగా సవరణలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. నిబంధనల ప్రకారం ఓటరు నమోదు, మార్పులు చేర్పుల ప్రక్రియను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఫీజుల దోపిడి అరికట్టాలి టీజీవీపీ

**నిర్మల్ జిల్లా ప్రతినిధి జులై 06 (తెలంగాణ పత్రిక)**

నిర్మల్ జిల్లా లో నిబంధనలకు విరుద్ధంగా కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు నూతన అడ్మిషన్ల ప్రక్రియ టెక్నో. మెమోరియల్. కాన్సెప్ట్ . స్టార్ ప్రైమ్ . తోకలు ఈకలు పెట్టుకొని స్వంత భవనాలు. పర్మిషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తా ఉంటేనే ఆ తోకలను వెంటనే కత్తిరించాలని విద్యాశాఖ అధికారులను డిమాండ్ చేస్తా ఉన్నాం .? ప్రయత్నాలు చేసి ముగించుకున్నా పరిశీలన చేయాల్సిన విద్యాశాఖ అధికారులు తమకేమీ తెలియనట్లుగా పట్టింపు లేని ధోరణితో మొద్దు పోతున్నారా ఈ సమావేశంలో ఉమ్మడి అదిలాబాద్ జిల్లా మరియు రాష్ట్ర ఆర్గనైజర్ సెక్రటరీ కోట్టూరి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యా ప్రమాణాలు పాటించకుండా సంపాదనే లక్ష్యంగా విద్యా వ్యాపారానికి పాల్పడుతూ పేద వర్గాల వద్ద అధిక మొత్తంలో డొనేషన్ల పేరుతో ఫీజులను గుంజుతూ పేదల రక్తాన్ని జలగల్లా పీల్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ



నిబంధనలు పాటించని ఏ ఒక్క ప్రైవేట్ విద్యాసంస్థపై అధికారులు చర్యలు తీసుకునే సాహసం చేయలేకపోతున్నారని దీని అంతర్యం ఏమిటో విద్యాశాఖ అధికారులే చెప్పాలని డిమాండ్ చేశారు. ఆకాశాన్ని తాకే ఎత్తయిన భవనాలలో తరగతులు నిర్వహించడం, సురక్షిత మంచినీటి సౌకర్యం కల్పించకపోవడం, గ్రౌండ్ సౌకర్యం లేకపోవడం, ఫైర్ సేఫ్టీ లేకపోవడం, ప్రీ ప్రైమరీ కి పర్మిషన్ తీసుకొని హై స్కూల్స్ నడిపిస్తున్న వైనం,తరగతి గదులలో కనీసం వెలుతురు,గాలి లేకుండా చీకటి గదులలో తరగతులను కొనసాగించడం, అర్హతలు లేని ఉపాధ్యాయులను తక్కువ జీతభత్యాలకు నియమించుకోవడం లాంటి అసౌకర్యాలను విద్యార్థులకు కల్పించి లక్షల రూపాయలు డిమాండ్ చేసినా విద్యాశాఖ అధికారులు నోరు మెదపకుండా గప్ చుప్ సంబర బుడ్డి లాగ వ్యవహరించడం బాధాకరమని వారు అన్నారు. కమిషన్లకు కక్కుర్తి పడిన అధికారుల నిర్లక్ష్యం వైఖరి మూలంగా ప్రభుత్వ బడులు నిర్లక్ష్యానికి గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు మేల్కొని విద్యాహక్కు చట్టం ప్రకారం పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించాలి అలా నడుచుకోని ప్రైవేటు విద్యాసంస్థలపై తక్షణమే చర్యలు తీసుకొని తమ నిజాయితీని నిరూపించుకోవాలని వారు తెలిపారు. జిల్లా యంత్రాంగం సైతం స్పందించి ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజులు, సౌకర్యాలను పర్యవేక్షించి ప్రభుత్వానిబంధనలు పాటించని వారిపై చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో నిర్మల్ నియోజకవర్గ కన్వీనర్ గణేష్ నాగరాజు ఆత్మరాం మణికంఠ మహేష్ రాజేష్ అరుణ్ శివ రాజ్ కుమార్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డా... వరి చేనా? రామంతపూర్ రైతుల ఆవేదనకు ఇదే నిదర్శనం!

**వెల్దుర్తిమండల ప్రతినిధి,జులై 06 (తెలంగాణ పత్రిక):**

మాసాయపేట మండలం రామంతపూర్ గ్రామంలో ప్రధాన రహదారి దుస్థితి అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. రహదారిపై వాహనాలు నడవాల్సిన చోట రైతులు వరినాట్లు వేసి నిరసన తెలపాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రజల గోడును పట్టించుకునే వారు లేకపోవడంతో తమ బాధను వినూత్నంగా వ్యక్తం చేశారు రైతులు.

గ్రామ శివారులోని కంకర మిషన్ నుంచి ప్రతిరోజూ అధిక లోడుతో లారీలు రాకపోకలు సాగిస్తుండటంతో ఒకప్పుడు సజావుగా ఉన్న రహదారి ఇప్పుడు భారీ గుంతలతో ప్రమాదకరంగా మారింది. వర్షం కురిస్తే గుంతలు చెరువుల్లా మారి వాహనదారులకు ప్రాణసంకటంగా మారుతున్నాయి. రైతులు పంటలను మార్కెట్‌కు తీసుకెళ్లాలన్నా, విద్యార్థులు పాఠశాలకు వెళ్లాలన్నా, అత్యవసర సమయంలో ఆస్పత్రికి చేరాలన్నా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



పలుమార్లు కంకర మిషన్ యాజమాన్యానికి ఫిర్యాదు చేసినా స్పందన లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులకు కూడా ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోవడంతో చివరకు రోడ్డుపైనే వరినాట్లు వేసి తమ నిరసనను తెలియజేశారు.

**ప్రజల ప్రశ్నలు ఇవే...**

- రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యే వరకు అధికారులు ఎందుకు మౌనం వహించారు?
- అధిక లోడుతో తిరుగుతున్న లారీలపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు?
- రహదారిని పాడుచేసిన వారితోనే మరమ్మతులు ఎందుకు చేయించడం లేదు?
- ప్రజల ప్రాణాల కంటే నిర్లక్ష్యమే ముఖ్యమా?
- ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరు తీసుకుంటారు?

రామంతపూర్ ప్రజలు ఒక్కటే కోరుతున్నారు... కంకర మిషన్ యాజమాన్యం వెంటనే రహదారిని మరమ్మతు చేయాలి. సంబంధిత అధికారులు అధిక లోడుతో నడిచే లారీలపై కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రజల ఇబ్బందులను గుర్తించి శాశ్వత పరిష్కారం చూపాలి. రోడ్డుపై వరినాట్లు వేయాల్సిన పరిస్థితి రావడం అంటే అది కేవలం ఒక గ్రామ సమస్య కాదు... ప్రజా పాలనకు, అధికార యంత్రాంగానికి ఎదురవుతున్న పెద్ద ప్రశ్న. ఇకనైనా అధికారులు స్పందిస్తారా? లేక ప్రజల నిరసనలు మరింత ఉధృతం కావాల్సి వస్తుందా? అనే ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది.

# అంగన్వాడీలను బలోపేతం చేయాలి.. ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేయొద్దు

**-అంగన్వాడి ఉద్యోగుల మండల సదస్సులో నాయకుల డిమాండ్**

**తెలంగాణ పత్రిక దమ్మపేట జూలై 6**

దమ్మపేట: అంగన్వాడి కేంద్రాలు సమర్థవంతంగా పనిచేస్తున్న ప్రాంతాల్లో మాతా--శిశు మరణాలు తగ్గడంతో పాటు పోషకాహార లోపం కూడా గణనీయంగా తగ్గినట్లు పలు అంతర్జాతీయ సంస్థలు వెల్లడించాయని అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జి. పద్మ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐసీడీఎస్ పథకాన్ని సంవత్సరాలుగా నిర్లక్ష్యం చేస్తున్నాయని, పాలకులే ఐసీడీఎస్‌కు శత్రువులుగా మారారని ఆమె విమర్శించారు. సోమవారం దమ్మపేటలోని వాసవి క్లబ్‌లో అంగన్వాడి ఉద్యోగుల సమస్యలపై సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల సదస్సు నిర్వహించారు. సూరమ్మ వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జి. పద్మ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అంగన్వాడి కేంద్రాలు చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు



వారి సమగ్ర సంరక్షణకు కీలకమైన వ్యవస్థగా పనిచేస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. అయితే జాతీయ విద్యా విధానంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఐసీడీఎస్‌ను విద్యా వ్యవస్థలో విలీనం చేసే ప్రయత్నం చేస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం కూడా దానిని వేగంగా అమలు చేస్తోందని విమర్శించారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా పేద ప్రజలకు అందుతున్న సేవలను బలహీనపరిచే ఉద్దేశంతోనే కేంద్ర ప్రభుత్వం పీఎం శ్రీ పథకాన్ని తీసుకొచ్చిందని ఆరోపించారు. పీఎం శ్రీ కోసం కేటాయిస్తున్న నిధులను ఐసీడీఎస్‌కు కేటాయించి అంగన్వాడి కేంద్రాలను మరింత బలోపేతం చేయాలని ఆమె డిమాండ్ చేశారు. అంగన్వాడి కేంద్రాలను బలహీనపరచి, చివరకు




మూసివేసే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని, అందులో భాగంగానే ఐసీడీఎస్ బడ్జెట్ కేటాయింపుల్లో భారీ కోతలు విధించిందని ఆమె విమర్శించారు. ఐసీడీఎస్ పరిరక్షణ కోసం అంగన్వాడి ఉద్యోగులు ఐక్యంగా పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్, మండల కన్వీనర్ మురహరి రఘు, అంగన్వాడి యూనియన్ నాయకులు జ్యోతి, రాధ, కృష్ణవేణి, వెంకటేశ్వరమ్మ, నాగమణి, వెంకటలక్ష్మి, కృప, ముత్తమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# దోమకొండ లో ఆరోగ్య ఉపకేంద్రం ప్రారంభం

**కామారెడ్డి, జూలై 06,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)**

కామారెడ్డి జిల్లాదోమకొండ గ్రామ పరిధిలోని పలుగుగడ్డ ప్రాంత ప్రజలకు వైద్య సేవలను మరింత చేరువ చేస్తూ ఆరోగ్య ఉపకేంద్రాన్ని (హెల్త్ సబ్-సెంటర్) సోమవారం ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన సర్పంచ్ ఐరేణి నర్సయ్య రిబ్బన్ కట్ చేసి, ఉపకేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూపలుగుగడ్డ , పరిసర ప్రాంతాల ప్రజలు చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకు కూడా దూరంగా బస్టాండ్ వద్ద గల ఆరోగ్యకేంద్రానికి వెళ్లకుండా, పలుగుగడ్డ ప్రాంత ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు అందించాలనే సత్సంకల్పంతో ఈ ఉపకేంద్రాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. అలాగే ఇట్టి ఉప ఆరోగ్య కేంద్రం శాశ్వతభవనం కోసం ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ ఎం.పి. నిధులనుండి 10 లక్షల రూపాయలు మంజూరు చేయించి శాశ్వత భవనం నిర్మిస్తామని ఐరేని నర్సయ్య తెలిపారు. ఇట్టి కార్యక్రమానికి హాజరైన ఆరోగ్య కేంద్రం ఇంచార్జ్ సంజీవని సిస్టర్ మాట్లాడుతూ, గర్భిణీ స్త్రీలకు పరీక్షలు, చిన్న పిల్లలకు టీకాలు, బీపీ, షుగర్ వంటి సాధారణ వ్యాధులకు సంబంధించిన పరీక్షలు మరియు



మందులు ఈ కేంద్రం ద్వారా ఉచితంగా లభిస్తాయని వెల్లడించారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘం చైర్మన్ బత్తిని సిద్ధరాములు, ఉపసర్పంచ్ బొమ్మెర శ్రీనివాస్ , వార్డు సభ్యులు పాలకుర్తి శేఖర్, నాగారపు ఎల్లయ్య, బాలే సురేందర్, బీసు సంతోష్, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆశా వర్కర్లు మరియు పలుగుగడ్డ ప్రాంత కాలనీ వాసులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## కేజ్ వీల్స్ తో ట్రాక్టర్లు రోడ్డుపై తిరిగితే కఠిన చర్యలు ఎస్సై సనత్ కుమార్


**ఓదెల జులై 06 తెలంగాణ పత్రిక**




పోత్కపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోగల గ్రామాలలో వ్యవసాయ పనులు నిమిత్తమున ట్రాక్టర్ యజమానులు మరియు డ్రైవర్లు కేజీ వీల్స్ తో. రోడ్డుపై పెరిగితే కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ సనత్ కుమార్ తెలిపారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ రహదారులపై నడపడంపై నిషేధం – ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మిస్తున్న బీటీ (తారు), సీసీ రోడ్లను కొందరు రైతులు మరియు ట్రాక్టర్ యజమానులు పొలాల పనిముట్లు అయిన కేజ్ వీల్స్ తో రోడ్లపై నడపడం వల్ల రోడ్లు గుంతలమయంగా మారి తీవ్రంగా . రోడ్లు దెబ్బతినడమే కాక, ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు, ప్రమాదాలు జరుగుతున్నాయి. ట్రాక్టర్లకు పొలాల్లో వాడే ఇనుప కేజ్ వీల్స్ ఉన్నట్లయితే, వాటిని రోడ్లపై నడపడం పూర్తిగా నిషేధించబడింది. అని అన్నారు నిబంధనలను ఉల్లంఘించి రోడ్లపైకి కేజ్ వీల్స్ తో వచ్చే ట్రాక్టర్లపై: మొదటిసారి పట్టుబడితే: రూ. 5,000/- జరిమానా రెండోసారి పట్టుబడితే: రూ. 10,000/- జరిమానా మూడోసారి పట్టుబడితే: ట్రాక్టర్ సీజ్ చేయడంతో పాటు కఠిన చట్టపరమైన కేసులు నమోదు చేయబడతాయి ఎస్సై సనత్ కుమార్ తెలిపారు.

## మంగళవారం సంత కు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నుండి అధికారిక అనుమతి





VEGETABLE MARKET YOUTH ASSOCIATION

**తెలంగాణ పత్రిక న్యూస్ ప్రతినిధి శేర్లింగంపల్లి నియోజకవర్గం జులై 6.**

మియాపూర్ మంగళవారం సంతకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి అధికారిక అనుమతి. మియాపూర్ ప్రాంత ప్రజలకు, వ్యాపారులకు శుభవార్త. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసీ ) నుండి మియాపూర్ మంగళవారం సంత నిర్వహణకు అధికారిక అనుమతి పత్రం ఈరోజు అందడం జరిగింది. మార్కెట్ కమిటీ ప్రతినిధులు ఈ అనుమతి పత్రాన్ని అధికారికంగా స్వీకరించారు. గత నాలుగు వారాలుగా మార్కెట్ వ్యాపారుల జీవనోపాధిని కాపాడాలనే లక్ష్యంతో చేపట్టిన నిరంతర పోరాటానికి ఇది విజయవంతమైన ఫలితం. ఇకపై రేపటి నుంచి ప్రతి మంగళవారం మియాపూర్ మంగళవారం సంత ఎటువంటి ఆటంకాలు లేకుండా, అధికారిక అనుమతులతో నిర్వహించబడుతుంది. ఈ సందర్భంగా ఈ అనుమతి లభించేందుకు సహకరించిన పెద్దలు, గౌరవనీయులు, ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. ప్రత్యేకంగా: పార్లమెంట్ సభ్యులు శ్రీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి కి, కంటెస్టెడ్ ఎమ్మెల్యే, రాష్ట్ర నాయకులు శ్రీ రవికుమార్ యాదవ్ కి, సీఎంసీ కమిషనర్ మేడం కి, సంబంధిత అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు, ఈ ఉద్యమానికి అండగా నిలిచిన మిత్రులకు, మార్కెట్ కమిటీ సభ్యులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాము. ఈ కార్యక్రమంలో బోయిని మహేష్ యాదవ్, అడ్వకేట్ కిషోర్ యాదవ్ , లక్ష్మణ్ , రాధాకృష్ణ యాదవ్ , గణేష్ , దేవేందర్ మరియు మార్కెట్ కమిటీ సభ్యులు, వ్యాపారులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. మియాపూర్ మంగళవారం సంతను విజయవంతంగా నిర్వహిస్తూ, వ్యాపారుల జీవనోపాధిని పరిరక్షించేందుకు మార్కెట్ కమిటీ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని ఈ సందర్భంగా తెలియజేశారు.

# హోటల్ యజమానిపై దౌర్జన్యం చేసిన గ్రామపంచాయతీ సిబ్బంది

**-హోటల్ యజమాని ఫిర్యాదు చేసిన పట్టించుకొని పోలీస్ శాఖ**



కమలాపూర్ తెలంగాణ పత్రిక ప్రతినిధి( జూలై 6 )

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని హోటల్ యజమాని ఎడ్ల రవి జీవనోపాధి కోసం బెల్ట్ షాప్ పెట్టుకొని జీవనం సాగిస్తుండగా కమలాపూర్ గ్రామపంచాయతీ నూతన పాలకవర్గం గ్రామంలో బెల్ట్ షాపులు నిర్వహించకూడదని హోటల్స్ యజమానులకు , బెల్ట్ షాప్ వారికి ఆదేశాలు ఇవ్వగా వారి ఆదేశాల మేరకు బెల్ట్ షాప్ బందు చేసినట్లు తెలిపాడు. తను హోటల్ మాత్రమే నడిపిస్తుండగా 02 .06 .2026 అర్ధరాత్రి గ్రామ పంచయితి పాలకవర్గం, సిబ్బంది, గ్రామనికి చెందిన గుర్తు తెలియని వ్యక్తులు హోటల్ వద్దకు వచ్చి నిద్రపోతున్న నన్ను తలుపులు తట్టి లేపి హోటల్లోకి ప్రవేసించి ఫర్నిచర్ ధ్వంసం చేస్తుండడంతో నేను ఇదేంటి అని అడగగా నీ దిక్కున చోట చెప్పుకో, డబ్బులు ఇచ్చి హోటల్ నడుపుకో అని బెదిరించి టేబుల్ డ్రాలో ఉన్న డబ్బులు చిందర వందర చేసి డ్రాలో ఉన్న బంగారు చైను తీసుకువెళ్లారని బాధితుడు తెలిపాడు. ఈ విషయంపై పోలీసు అధికారులకు సి ఐ , ఏ సీ పి, డీఎస్పీకి ఫిర్యాదు చేసినప్పటికీని అధికారులు స్పందించడం లేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఇంతవరకు వారిపై ఎలాంటి చర్యలు చేపట్టలేదనీ విచారం వ్యక్తం చేశాడు. ఈ విషయంపై అధికారులు వెంటనే స్పందించి న్యాయం చేయాలని అలాగే నాపై దౌర్జన్యం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశాడు.

# 104దీూా బ్లాక్ లో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ పూర్తి



కామారెడ్డి,జులై 6, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా దోమకొండ మండల కేంద్రంలో సర్ భాగంలో 104 బ్లాక్ లోఎన్యుమరేషన్ ఫారా లపంపిణీ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని దోమకొండ కాంగ్రెస్ పట్టణ టౌన్ అధ్యక్షులు సీతారాం మధు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిపిఓ అశోక్, డిఎల్ఓస్వరూప తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఆటో సౌకర్యం కల్పించిన ప్రధానోపాధ్యాయులు లోకేశ్వర్

కామారెడ్డి, జులై 6, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండల్ లింగంపల్లి గ్రామం నుండి భూంపల్లి పాఠశాలకు వస్తున్న 15 మంది విద్యార్థులకు సౌకర్యార్థం కొరకు లింగంపల్లి గ్రామస్తుల సహకారంతో ప్రధానోపాధ్యాయులు లోకేశ్వర్ సార్ గ్రామస్తులతో మాట్లాడి వారి సహకారంతో ఆటో మాట్లాడటం జరిగింది ఇలా ఆటో ఏర్పాటు చేయడంతో లింగంపల్లి గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు ఆటో ఏర్పాటు చేయడంలో లింగంపల్లి గ్రామ సర్పంచ్ లావణ్య రమేష్ ఉప సర్పంచ్ గంగాధర్. భూంపల్లి గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ గ్రామ ఉపసర్పంచ్ రాజయ్య వార్డ్ మెంబర్లు గ్రామస్తులు ఎంతగానో ప్రోత్సహించారు భూంపల్లి పాఠశాల తరఫున ప్రధానోపాధ్యాయులు మరియు లింగంపల్లి గ్రామ సర్పంచ్ మరియు ఉప సర్పంచ్ వార్డ్ మెంబర్లకు గ్రామస్తులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లోకేశ్వర్, ఉపాధ్యాయులు. శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, ఉమాదేవి, ముత్తన్న, హైమావతి, మాలతి, చింతల లింగం పాల్గొన్నారు.

# ప్రమాదంలో గాయపడిన వారిని పరామర్శించిన మనిషా లక్ష్మి

ఖమ్మం జిల్లా ప్రతినిధి: జులై 7 తెలంగాణ పత్రిక





వైరా మున్సిపాలిటీ పరిధిలో మూడో వార్డుకు చెందిన లింగారావు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన సంగతి తెలుసుకున్న బిఆర్ఎస్ వైరా నియోజకవర్గ నాయకురాలు బానోతు మనిషా లక్ష్మి మదన్ లాల్ సోమవారం పరామర్శించారు. లింగారావు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం ఒకటో వార్డుకి చెందిన బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అప్పల సురేష్ కొడుకు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు, ఆయన ఇంటికి కూడా వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం, భరోసా ఇచ్చారు. రాజశేఖర్ నగర్ లో గాయపడిన పసుపులేటి సురేష్ ని కూడా పరామర్శించి ధైర్యం చెప్పారు. అంతకుముందు వేమిశెట్టి సురేష్ దివ్య దంపతుల కుమార్తె దీక్షిత ఓణీల అలంకరణ వేడుకకు హాజరై చిరంజీవి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కట్ట కృష్ణ అర్జునరావు, ఐదవ వార్డు కౌన్సిలర్ కట్ట సుధారాణి, 8వ వార్డు కౌన్సిలర్ చిలక చిన్న కోటయ్య, పాముల వెంకటేశ్వర్లు, కర్నాటి వీరభద్రం, వేగా వెంకటేశ్వర్లు, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

# రేపటిలోగా ఎన్యుమరేషన్ ఫారాల పంపిణి ప్రక్రియ పూర్తి చేయాలి

**-ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణలో డిజిటైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలి**

కామారెడ్డి, జూలై 6,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతి నిధి)






రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో ఎన్యుమరేషన్ ప్రక్రియను రేపటిలోగా పూర్తి చేసి, డిజిటైజేషన్‌ను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఎన్నికల నమోదు అధికారులు (ఈఆర్ఓలు), సహాయ ఎన్నికల నమోదు అధికారులు (ఏఈఆర్ఓలు)తో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జూన్ 25 నుంచి ప్రారంభమైన ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ తుది దశకు చేరుకుందని తెలిపారు. పంపిణీ చేసిన ఫారాలను ఓటర్లు పూర్తి చేసిన అనంతరం వాటిని తిరిగి సేకరించి, సంబంధిత బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) బి ఎల్ ఓ యాప్‌లో డిజిటైజేషన్ చేయాలని సూచించారు. అవసరమైతే వాలంటీర్ల సహకారంతో ఓటర్లకు ఫారాల పూరణలో సహాయం అందించాలని తెలిపారు. డిజిటైజేషన్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జూలై 20 నాటికి పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. అనంతరం పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ చేపట్టి, ఒక్కో పోలింగ్ కేంద్రంలో 1,200 మందికి మించకుండా ఓటర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తప్పుడు సమాచారం సమర్పించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పాల్గొని మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటివరకు 99 శాతం ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ పూర్తైందని, మిగిలిన ప్రక్రియను రేపటిలోగా పూర్తి చేస్తామని తెలిపారు. జిల్లాలో డిజిటైజేషన్ ప్రక్రియ కొనసాగుతున్నదని, పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్‌ను పకడ్బందీగా చేపడతామని, బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్లతో కార్యాచరణ ప్రకారం సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు . జిల్లాలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల సమన్వయంతో కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు విక్టర్, ఎన్.వి. గిరి, ఎల్లారెడ్డి ఆర్డీవో, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రవితేజ, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసి ఉంటున్న పేదలకు ఇంటి పట్టా ఇచ్చి ఇందిరమ్మ గృహాలు నిర్మించి ఇవ్వాలి

**-జిల్లా బహుజన లెఫ్ట్ పార్టీ నాయకులు వడ్లసాయి కృష్ణ**

కామారెడ్డి, జులై 6,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



కామారెడ్డి జిల్లా వ్యాప్తంగాప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు ఇంటి స్థల పట్టాలు మంజూరు చేసి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించడంతో పాటు, దశాబ్దాలుగా అద్దె ఇళ్లలో నివసిస్తున్న అర్హులైన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి అని వడ్ల సాయి కృష్ణ బహుజన లెఫ్ట్ పార్టీ కామారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరోజు కామారెడ్డి జిల్లా కలెక్టర్ ని కలిసి వినతి పత్రం సమర్పిచటం జరిగింది. కామారెడ్డి జిల్లాలో ప్రభుత్వ స్థలాల్లో దశాబ్దాలుగా గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న వేలాది నిరుపేద కుటుంబాలు, అలాగే స్వంత ఇల్లు లేక దశాబ్దాలుగా అద్దె ఇళ్లలో నివసిస్తున్న అనేక పేద కుటుంబాలు తీవ్రమైన ఆర్థిక, సామాజిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. గృహం లేకపోవడం వల్ల వారు అభద్రతతో కూడిన జీవితాన్ని గడుపుతున్నారు. ప్రభుత్వ స్థలాల్లో నివసిస్తున్న పేదలను ఆక్రమణదారులుగా పరిగణించకుండా, వారి వాస్తవ పరిస్థితులను గుర్తించి చట్టబద్ధమైన ఇంటి స్థల పట్టాలు మంజూరు చేయాలి. అలాగే ఎన్నో సంవత్సరాలుగా అద్దె భారంతో జీవిస్తున్న అర్హులైన నిరుపేద కుటుంబాలను గుర్తించి, వారికి కూడా ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా శాశ్వత గృహాలు కల్పించాలి. ఈ ప్రక్రియలో పారదర్శకంగా సమగ్ర సర్వే నిర్వహించి, నిజమైన అర్హులైన పేద కుటుంబాలను గుర్తించి న్యాయం చేయాలని కోరుతున్నాము. మా ప్రధాన డిమాండ్లు: ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న అర్హులైన పేదలందరికీ వెంటనే ఇంటి స్థల పట్టాలు మంజూరు చేయాలి. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి నిర్మాణం చేపట్టాలి. దశాబ్దాలుగా అద్దె ఇళ్లలో నివసిస్తున్న అర్హులైన పేద కుటుంబాలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి. ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఉంటున్న పేదలను బలవంతంగా ఖాళీ చేయకుండా వారి గృహ హక్కును చట్టబద్ధంగా పరిరక్షించాలి. తాగునీరు, విద్యుత్, రహదారులు, డ్రైనేజీ, ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలి. పై అంశాలను మానవతా దృక్పథంతో పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని వినయపూర్వకంగా కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా బహుజన మహిళా సంఘం అధ్యక్షురాలు గంగామణి, ప్రధాన కార్యదర్శి స్వప్న, కామారెడ్డి జిల్లా అధ్యక్షులు చౌకీ ప్రసాద్, నాయకులు రాధ భాయ్ లు పాల్గొన్నారు.

# ఆదాయాన్నిచ్చే ఆయిల్ పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలి

**-ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ**

కామారెడ్డి, జులై 6,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



కామారెడ్డి జిల్లాలోనిరైతులు ఆదాయాన్ని పెంచుకునేందుకు వరి వంటి సంప్రదాయ పంటలతో పాటు ఆదాయాన్నిచ్చే ఆయిల్ ఫామింగ్పై దృష్టి సారించాలని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సూచించారు. మాటలు కాదు చేతలు అంటూ జిల్లాలోని తన 12 ఎకరాల వరి పొలంలో వరి సాగు నిలిపివేసి ఆయిల్ ఫామ్ మొక్కలను నాటి రైతులకు ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూభూగర్భ జలాల పరిరక్షణ, నీటి వినియోగం తగ్గింపు, రైతుల ఆదాయం పెంపునకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహిస్తోందని తెలిపారు. ఆయిల్ పామ్ వంటి వాణిజ్య పంటలకు భవిష్యత్తులో మంచి మార్కెట్ ఉంటుందని, స్థిరమైన ఆదాయం లభిస్తుందని వివరించారు. వరి సాగులో సాగునీరు, ఉత్పత్తి వ్యయం ఎక్కువగా ఉండడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో నీటిని ఆదా చేసే పంటల సాగు అనివార్యమని, ఆయిల్ పామ్ ద్వారా దీర్ఘకాలికంగా మెరుగైన లాభాలు పొందవచ్చని పేర్కొన్నారు. రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటల వైవిధ్యం పెంచుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు శాస్త్రీయ సలహాలు ఇస్తూ ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చేందుకు ప్రోత్సాహకాలు, సాంకేతిక సహకారం అందిస్తోందని షబ్బీర్ అలీ తెలిపారు. రైతుల్లో విశ్వాసం పెంచేందుకే ముందుగా తన క్షేత్రంలో ఆయిల్ ఫామ్ మొక్కలను నాటుతున్నట్లు ఆయన వివరించారు.

# ప్రజావాణిలో 80 దరఖాస్తులు స్వీకరణ

-అర్జీలను సత్వరమే పరిష్కరించాలి
-కామారెడ్డిజిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి , జూలై 6,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన 80 దరఖాస్తులను స్వీకరించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులను కలెక్టర్ స్వయంగా వారి సమస్యలను తెలుసుకున్నారు. అందిన ప్రతి



దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులకు పంపిస్తూ, వాటిని ప్రాధాన్యతతో పరిశీలించి నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం పెండింగ్ దరఖాస్తుల పై ఆరా తీశారు. తహసీల్దార్ లు, ఆయా శాఖల అధికారులు ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులతో పాటు, ఆయా సంక్షేమ, అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని, ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం ఉండరాదని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విక్టర్, ఎన్నిగిరి, పీడీసీ రవితేజ, ఆర్డీవో పాండు, జడ్పీ సీఈఓ చందర్, , జిల్లా స్థాయి అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన - కలెక్టర్, సిపి

ఖమ్మం జిల్లా ప్రతినిధి: జులై 7 తెలంగాణ పత్రిక

ముఖ్యమంత్రి బహిరంగ సభకు జిల్లా యంత్రాంగం పూర్తి సన్నద్ధం అయ్యింది. చింతకాని మండలంలో జగన్నాథపురం వద్ద సభా వేదిక, హెలిప్యాడ్, పార్కింగ్, భద్రతా ఏర్పాట్ల పై అధికారులకు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, సిపి సునీల్ దత్ దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ముఖ్యమంత్రి పర్యటన కోసం అన్ని శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని చింతకాని మండలం జగన్నాథపురం(మత్కెపల్లి) వద్ద నిర్వహించనున్న బహిరంగ సభ కు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్న నేపథ్యంలో సభ ఏర్పాట్లను సోమవారం జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కలెక్టర్ పోలీసు కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి సభా ప్రాంగణం, హెలిప్యాడ్, వాహన పార్కింగ్ ప్రాంతాలు, ప్రజల రాకపోకలకు అనువైన మార్గాలు, భద్రతా ఏర్పాట్లను సమగ్రంగా పర్యవేక్షించి, ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం కోసం పకడ్బంది చర్యలపై వివిధ శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూన్ 30న భారీ బహిరంగ సభ నిర్వహించి రైతు భరోసా కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయించినప్పటికీ, అప్పటి భారీ వర్షాలు, వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో కార్యక్రమాన్ని వాయిదా వేయాల్సి



వచ్చిందని కలెక్టర్ గుర్తుచేశారు. ఉప ముఖ్యమంత్రి సమక్షంలో జరిగిన సమీక్షలో కూడా వాతావరణ పరిస్థితులు అనుకూలించిన తర్వాత కొత్త తేదీని నిర్ణయిస్తామని వెల్లడించినట్లు తెలిపారు. వాతావరణ శాఖ జూలై 6వ తేదీ వరకు భారీ వర్షాల సూచనలు ఇచ్చిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండి పరిస్థితులను నిరంతరం పరిశీలించిందన్నారు. అయితే ఊహించినంతగా వర్షాలు నమోదు కాకపోవడంతో సభ నిర్వహించాల్సిన ప్రాంగణాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి గ్రౌండ్ పరిస్థితులను అంచనా వేస్తున్నామని అన్నారు. ప్రస్తుతం సభా ప్రాంగణం దాదాపు పూర్తిగా ఎండిపోయి కార్యక్రమం నిర్వహించేందుకు అనుకూలంగా ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించామని తెలిపారు. ఈ మేరకు జిల్లా యంత్రాంగం చేసిన ఏర్పాట్లు, ప్రాంగణ పరిస్థితులు, ఇతర అంశాలపై వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి, ముఖ్యమంత్రి కార్యాలయానికి నివేదిక అందజేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ముఖ్యమంత్రి కార్యక్రమానికి సంబంధించిన తేదీని ప్రభుత్వం త్వరలో అధికారికంగా ఖరారు చేస్తుందని, తేదీ నిర్ణయమైన వెంటనే ప్రజలకు అధికారిక సమాచారం అందజేస్తామని తెలిపారు. అప్పటివరకు అన్ని శాఖలు పూర్తి సన్నద్ధతతో ఉండి అవసరమైన ఏర్పాట్లను సిద్ధంగా ఉంచాలని అధికారులను కోరారు. సభకు భారీ సంఖ్యలో రైతులు, ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున అన్ని ఏర్పాట్లను ముందస్తుగా ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని మిగిలిన పనులు సభా వేదిక నిర్మాణం, హెలిప్యాడ్ ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, ప్రజల కూర్చునే ఏర్పాట్లు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే వ్యవస్థలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన అన్ని ప్రోటోకాల్ ఏర్పాట్లు నిబంధనలకు అనుగుణంగా ఉండేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. అలాగే సభకు హాజరయ్యే రైతులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీటి సౌకర్యం, నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, తాత్కాలిక మరుగుదొడ్లు, వైద్య శిబిరాలు, అంబులెన్స్ సేవలు, అగ్నిమాపక ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు, భద్రతా బందోబస్తు వంటి అంశాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్, రెవెన్యూ, పోలీసు, విద్యుత్, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఏబీవీపీ ఆధ్వర్యంలోజులై 14 న రాష్ట్ర వ్యాప్త కళాశాలల బంద్

-ఏబీవీపీరాష్ట్ర కార్యదర్శి మాచెర్ల రాంబాబు

కామారెడ్డి , జూలై 6,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టి, బీసీ, ఈ బి సి విద్యార్థులకు ఉచితంగా ఉన్నత విద్యను అందించాలని,తద్వారా వారి కుటుంబాలను ఆర్థికంగా, సామాజిక ఉన్నతంగా నిలబెట్టాలనే ఉద్దేశ్యంతో గత ప్రభుత్వాలు తీసుకొచ్చిన ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని ఎత్తివేసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్రపన్నుతున్నదని,ఫీజు రీయింబర్స్మెంట్ఏబీవీపీ రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో జూలై 14వ తేదీన రాష్ట్ర వ్యాప్త కళాశాలల బంద్ కు పిలుపునిస్తున్నట్లు ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచెర్ల రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా కామారెడ్డి లో నిర్వహించిన భారీ నిరసన ర్యాలీ అనంతరం రాంబాబు మాట్లాడుతూ"రాష్ట్రంలో 20 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వం అందించే ఫీజు రీయింబర్స్మెంట్,స్కాలర్షిప్ లపై ఆధారపడి చదువుకుంటున్నారని, కానీ ప్రభుత్వం సరైన సమయంలో ఫీజు రీయింబర్స్మెంట్



విడుదల చేయని కారణంగా 11000 కోట్ల బకాయిలు పేరుకుపోయాయన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రతి యేట 2 లక్షల మంది విద్యార్థులు డ్రాపౌట్ అవుతున్నారని,4.5 మంది సర్టిఫికెట్స్ తీసుకోలేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు.ఇక్కడి విద్యార్థులు పక్క రాష్ట్రాలకు వలసవెళ్లే పరిస్థితి దాపురించిందన్నారు. గతంలో ఉన్న ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని తుంగలో తొక్కుతూ పేద విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేస్తున్నదని,మా ప్రభుత్వంలో బకాయిలు చెల్లించడంతో పాటుగా,గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేసి ప్రతి నెల ఫీజులు చెల్లిస్తామని చెప్పిన నేటి ముఖ్యమంత్రి తానే విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పటికీ ఇప్పటి వరకు బకాయిలు విడుదల చేయకపోవడంతో ఈ విషయం కోర్టు మెట్లు ఎక్కిందనీ అన్నారు. ప్రైవేట్ కాలేజీలు ప్రభుత్వం కలిసి ఆడుతున్న నాటకంలో విద్యార్థులు బలి అవుతున్నారని,బడ్జెట్ కాలేజిలు సైతం మూతపడుతున్నాయని, పొట్టకూటి కోసం లెక్చరర్ గా మారిన నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని దీనికి కారణం ప్రభుత్వ నిర్లక్ష్యమే అన్నారు. సోమవారం కామారెడ్డి లో నిర్వహించిన ఈ భారీ నిరసన ర్యాలీతో అయినా ప్రభుత్వం కళ్ళు తెరవాలని, లేకపోతే ఇదే రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి అంకురార్పణ అవుతుందని, అన్ని కళాశాల ప్రాంగణాలు, విశ్వవిద్యాలయాలు మరోసారి ఉద్యమ వేదికలై కాంగ్రెస్ పార్టీకి మరణశాసనం రాస్తాయన్నారు.పేద విద్యార్థులను చదువులకు దూరం చేస్తూ రాక్షసానందం పొందుతున్న ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసన ఏబీవీపీ ఆధ్వర్యంలో జూలై 14 తేదీన నిర్వహించబోయే రాష్ట్ర వ్యాప్త కళాశాలల బంద్ ను విద్యార్థులు, తల్లిదండ్రులు,మేధావులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# జీఆర్ఎం, ఎంఆర్ఎంతో సైబర్ బాధితులకు ఉపశమనం

-కామారెడ్డి జిల్లాఎస్పీ రాజేష్ చంద్

కామారెడ్డి, జూలై 6,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

జీఆర్ఎం, ఎంఆర్ఎం మాడ్యూళ్ల ద్వారా సైబర్ నేర బాధితులకు త్వరితగతిన ఉపశమనం కల్పించాలని కామారెడ్డి పోలీసులు నిర్ణయించారు. ఎస్పీ రాజేష్ చంద్ర ఆదేశాలతో సోమవారం జిల్లా సైబర్ క్రైం కో--ఆర్డినేషన్ సెంటర్ ఆధ్వర్యంలో అన్ని పోలీస్ స్టేషన్ల సైబర్ వారియర్స్‌కు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాలతో సంబంధం లేకుండా బ్యాంక్ ఖాతాలు లేదా నగదు ఫ్రీజ్ అయిన పౌరులు జీఆర్ఎం పోర్టల్ ద్వారా వినతి సమర్పించవచ్చని ఎస్పీ తెలిపారు. దర్యాప్తు అధికారి బ్యాంకులతో సమన్వయం చేసి నిబంధనల మేరకు అర్హుల ఖాతాలను డీ ఫ్రీజ్ చేస్తారని వివరించారు. సైబర్ మోసాలకు గురై నష్టపోయిన బాధితులకు ఎంఆర్ఎం మాడ్యూల్ ద్వారా రూ.50 వేల లోపు మొత్తాన్ని కోర్టు ఉత్తర్వులు లేకుండానే పరిశీలన అనంతరం తిరిగి అందజేస్తారన్నారు. దీంతో బాధితులకు వెంటనే న్యాయం



అందడంతో పాటు కోర్టు ప్రక్రియకు పట్టే సమయం గణనీయంగా తగ్గుతుందని పేర్కొన్నారు. జీఆర్ఎం, ఎంఆర్ఎం మాడ్యూళ్లను సమర్థంగా వినియోగించి ప్రజల వినతులను సత్వరమే పరిష్కరించాలని, బ్యాంకులు, దర్యాప్తు అధికారులతో సమన్వయం పెంచాలని సైబర్ వారియర్స్‌కు ఎస్పీ ఆదేశించారు. ఈ విధానంతో పోలీసు సేవలు మరింత పారదర్శకంగా ప్రజలకు చేరువవుతాయని, తద్వారా శాఖపై ప్రజల విశ్వాసం పెరుగుతుందన్నారు.

## ఆరేపల్లిసబ్ స్టేషన్కు తాళం ఆపరేటర్ నిర్బంధం



కామారెడ్డి, జూలై 6,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

పాల్వంచ మండలం ఆరేపల్లి గ్రామంలో విద్యుత్ కోతలపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సబ్స్టేషన్ ఆపరేటర్ను నిర్బంధించి నిరసన తెలిపారు. కామారెడ్డిలో ఈ ఘటన కలకలం రేపింది. గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా పవర్ కట్ అవుతుండటంతో సోమవారం విద్యుత్ సబ్ స్టేషన్ ఆపరేటర్ను లోపలే నిర్బంధించి తాళం వేశారు. ప్రస్తుతం వరిసీజన్ కావడంతో రైతులంతా నారుమడులు సిద్ధం చేసుకుని పొలాల్లోకి దిగుతున్నారు. కానీ రోజుకు కొన్ని గంటలు మాత్రమే కరెంట్ ఇస్తుండటంతో బోరు మోటార్లు నడవడం లేదు. ఫలితంగా వేసిన నారు ఎండిపోతుందని, సాగు అంతా నష్టపోయే పరిస్థితి వచ్చిందని రైతులు కన్నీరు పెట్టుకున్నారు. కరెంటు లేకపోతే వరినాట్లు వేయడం కష్టమని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని ఆరోపించారు. అధికారులు స్పందించకపోవడంతో విసిగిపోయిన రైతులు నేరుగా సబ్ స్టేషన్కు వెళ్లి ఆపరేటర్ను అడ్డుకున్నారు. ఉన్నతాధికారులు వచ్చి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేంతవరకు తాము కదిలే ప్రసక్తే లేదని భీష్మించుకుని కూర్చున్నారు. వెంటనే విద్యుత్ సరఫరాలో కోతలు ఆపి, వరినాట్ల సమయ 24 గంటల కరెంటు ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మరింత పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని రైతులు హెచ్చరించారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

-జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
-ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు..



తెలంగాణ పత్రిక జూలై 6 ఖమ్మం

ప్రజావాణిలో ప్రజలు సమర్పించే దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు సత్వరమే పరిశీలించి, పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలు సమర్పించిన ప్రతి దరఖాస్తును సానుకూల దృక్పథంతో పరిశీలించి, అర్హత ఉన్న వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఖమ్మం అర్బన్ మండలం 15వ డివిజన్‌కు చెందిన సయ్యద్ రహమత్ బీ తాను అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నానని, సొంత ఇంటి స్థలం కూడా లేదని, డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించగా, ఖమ్మం మున్సిపల్ కమీషనర్ కు పంపిస్తూ, నిబంధనల మేరకు పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. తిరుమలాయపాలెం మండలానికి చెందిన భానురేఖ టేకులపల్లి మహిళా ప్రాంగణంలో ఏఎన్ఎం కోర్సు పూర్తి చేసినప్పటికీ, ఏఎన్ఎం సర్టిఫికెట్ రిజిస్ట్రేషన్ విషయంలో అధికారులు స్పందించడం లేదని దరఖాస్తు సమర్పించగా, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారికి విచారించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. నేలకొండపల్లి మండలం రెవెన్యూ గ్రామానికి చెందిన లక్కం వెంకన్న, బక్కయ్య, శ్రీనివాస్ లు సర్వే నంబర్లు 993లో 23 గుంటలు, 616లో 15 గుంటలు, 1004లో 12 గుంటలు, 1005లో 12 గుంటల భూమి ఉందని, సాధా బైనామా కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ పాస్ పుస్తకాలు అందలేదని తెలపగా, సంబంధిత తహసీల్దార్‌కు పంపిస్తూ విచారించి నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రఘునాథపాలెం మండలం మంచుకొండ గ్రామానికి చెందిన వంగర రమాదేవి తన కుమార్తెకు కళ్యాణలక్ష్మి పథకం కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ మంజూరు కాలేదని తెలపగా సంబంధిత తహసీల్దార్‌కు పంపిస్తూ అర్హత మేరకు పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, డిఆర్ఓ సిహెచ్ రామ్మూర్తి, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ కె. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



# బాధ్యతతో ప్రజలకు అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయి

-జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
-పదవి విరమణ పొందిన ఉద్యోగులను ఘనంగా సన్మానించిన జిల్లా కలెక్టర్..
-జూన్ నెలలో పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్..



తెలంగాణ పత్రిక జూలై 6 ఖమ్మం

ప్రభుత్వ ఉద్యోగం ఒక బాధ్యతతో కూడినదని, బాధ్యతతో ప్రజలకు అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు.సోమవారం కలెక్టరేట్ లో జూన్ 30 నాటికి పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరై ఉద్యోగుల సేవలను కొనియాడారు. ఇంటర్మీడియట్ విద్యాశాఖ పరిధిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, పెనుబల్లిలో ప్రిన్సిపాల్‌గా పనిచేసిన సయ్యద్ యూసుఫ్, రెవెన్యూ శాఖలో తహసీల్దార్‌గా పనిచేసిన ఎస్.వి. నారాయణమూర్తి, హౌసింగ్ శాఖలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేసిన పి. సాయిరాం రెడ్డి, పశు సంవర్ధక శాఖ పరిధిలో మధిర ఏరియా ఆసుపత్రిలో నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పనిచేసిన ఎస్. చంద్ర భగీరథి దేవి, రెవెన్యూ శాఖలో గిర్దావర్‌గా పనిచేసిన అల్లం రవికుమార్, విద్యాశాఖలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేసిన షేక్ మదార్, ఇంటర్మీడియట్ విద్యాశాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన అయూబ్ ఖాన్, జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేసిన కె. వెంకన్న, గిరిజన సంక్షేమ శాఖలో జూనియర్ అసిస్టెంట్ గా పనిచేసిన షేక్ హసన్ పాషా, ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేసిన తేజావత్ పెంటయ్య, జిల్లా ఉపాధి కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్ గా పనిచేసిన ఎం. సిద్దిక్ పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ,ప్రభుత్వ ఉద్యోగం ఒక బాధ్యతతో కూడినదని, సుదీర్ఘ ఉద్యోగ జీవితంలో అంకితభావంతో సేవలందించిన ప్రతి ఉద్యోగి అభినందనీయుడని అన్నారు. 30 నుంచి 40 సంవత్సరాల పాటు ప్రజా సేవలో నిర్విరామంగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగిగా బాధ్యతతో ప్రజలకు అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుండి పోతాయని పేర్కొన్నారు. పదవి విరమణ పొందిన ఉద్యోగులందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి భవిష్యత్ జీవితం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో కొనసాగాలని కోరుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటిన జీజీహెచ్ కానిస్టేబుల్ లక్ష్మణరావు



కామారెడ్డి, జూలై 6,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జీజీహెచ్ పోలీస్ ఔట్ పోస్ట్ కౌంటర్లో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ లక్ష్మణ్ రావు మానవత్వం చాటారు. వివరాలు ఇలా ఉన్నాయి. క్షతగాత్రుడి వస్తువులు అందజేత తాడ్వాయి మండలం దేమికలాన్ గ్రామానికి చెందిన అంబీర్ లక్ష్మణ్ రావు సోమవారం నిజామాబాద్లో ఫంక్షన్కు వెళ్లాడు. తిరిగి బైక్పై కామారెడ్డికి వస్తుండగా గన్నారం ప్లాంట్ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయన తలకు బలమైన గాయం కావడంతో పాటు ఒక కాలు విరిగింది. ప్రమాదంలో స్పృహ కోల్పోవడంతో అంబులెన్స్లో జీజీహెచ్కుతరలించారు. ఆస్పత్రిలో అతనికి ప్రస్తుతం చికిత్స కొనసాగుతోంది. అయితే లక్ష్మణ్ రావు వద్ద ఉన్న పర్సులో 3 తులాలు బంగారు పుస్తెల తాడు, రూ.2,550 నగదు ఉండగా వాటిని జాగ్రత్త చేసిన కానిస్టేబుల్ లక్ష్మణ్ రావు బాధితుడి కొడుకు గోపిరావుకు అందజేశారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి - జిల్లా కలెక్టర్

ఖమ్మం జిల్లా ప్రతినిధి: జులై 7 తెలంగాణ పత్రిక

ప్రజావాణిలో ప్రజలు సమర్పించే దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు సత్వరమే పరిశీలించి, పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలు సమర్పించిన ప్రతి దరఖాస్తును సానుకూల దృక్పథంతో పరిశీలించి, అర్హత ఉన్న వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఖమ్మం అర్బన్ మండలం 15వ డివిజన్‌కు చెందిన సయ్యద్ రహమత్ బీ తాను అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నానని, సొంత ఇంటి స్థలం కూడా లేదని, డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించగా, ఖమ్మం మున్సిపల్ కమీషనర్ కు పంపిస్తూ, నిబంధనల మేరకు పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. తిరుమలాయపాలెం మండలానికి చెందిన భానురేఖ టేకులపల్లి మహిళా ప్రాంగణంలో ఏఎన్ఎం కోర్సు పూర్తి చేసినప్పటికీ, ఏఎన్ఎం సర్టిఫికెట్ రిజిస్ట్రేషన్ విషయంలో అధికారులు స్పందించడం లేదని దరఖాస్తు సమర్పించగా, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారికి విచారించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.



నేలకొండపల్లి మండలం రెవెన్యూ గ్రామానికి చెందిన లక్కం వెంకన్న, బక్కయ్య, శ్రీనివాస్ లు సర్వే నంబర్లు 993లో 23 గుంటలు, 616లో 15 గుంటలు, 1004లో 12 గుంటలు, 1005లో 12 గుంటల భూమి ఉందని, సాధా బైనామా కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ పాస్ పుస్తకాలు అందలేదని తెలపగా, సంబంధిత తహసీల్దార్‌కు పంపిస్తూ విచారించి నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రఘునాథపాలెం మండలం మంచుకొండ గ్రామానికి చెందిన వంగర రమాదేవి తన కుమార్తెకు కళ్యాణలక్ష్మి పథకం కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ మంజూరు కాలేదని తెలపగా సంబంధిత తహసీల్దార్‌కు పంపిస్తూ అర్హత మేరకు పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, డిఆర్ఓ సిహెచ్ రామ్మూర్తి, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ కె. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ సాయంతో పేదలకు ఊరట

-ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

తెలంగాణ పత్రిక జులై 6 కరీంనగర్

ఆపత్కాలంలో ఆరోగ్యం బాగాలేక ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకునే నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ఊరటనిస్తుందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు.సోమవారం ఇల్లంతకుంట మండల పరిషత్ కార్యాలయంలో ఆయన 26వ విడుత సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సహాయ నిధి పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆపత్కాలంలో ఎంతో ఊరటనిచ్చే పథకమని అన్నారు. వైద్య చికిత్స కోసం అప్పుల పాలవకుండా అర్హులైన వారికి ఆర్థిక సహాయం అందించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.ఇల్లంతకుంట మండలానికి సీఎంఆర్ఎఫ్ 26వ విడతలో 91 మందికి 26,17,000 రూపాయలు మంజూరు కాగా, వాటిని చెక్కుల రూపంలో అందజేస్తున్నామన్నారు. నియోజకవర్గ ప్రజల సంక్షేమం, అభివృద్ధే తన లక్ష్యమని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు రావాలంటే నెలల తరబడి వేచి చూడాల్సి వచ్చేదని ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పారదర్శకంగా, సత్వరంగా చెక్కులు మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని వ్యాధులకు, ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్న వారికి సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. బాధితులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఇల్లంతకుంట ఎంపీడీవో శశికళ, తహసీల్దార్ సురేష్ కుమార్, మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కోమటిరెడ్డి



భాస్కర్ రెడ్డి, పార్టీ నాయకులు ఐరెడ్డి మహేందర్ రెడ్డి, కె.అంతగిరి, మామిడి రాజు, నేరెళ్ల విజయ్ గౌడ్, నవీన్ కుమార్, బొలవేణి రమేశ్, కాత మల్లేశం, మాధవరెడ్డి,వంచ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. బాలికల పాఠశాలలో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ ఇల్లంతకుంట మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆయన తరగతి గదిలో బాలికల ప్రతిభను పరీక్షించారు. పాఠశాలలో ఎదురవుతున్న సమస్యలను గురించి బాలికలను అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా మధ్యాహ్న భోజన పథకం కింద అందిస్తున్న భోజనాలు, వంటల రుచుల గురించి కూడా అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాలికలతో కలిసి ఎమ్మెల్యే భోజనం చేశారు. తెనుగువానిపల్లెలో.. .ఇల్లంతకుంట మండలం తెనుగువానిపల్లెలో చౌకధరల దుకాణాన్ని సోమవారం మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకతే మా ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి నెలా నిర్ణీత గడువులోగా లబ్ధిదారులకు సరుకులు పొందాలని, ప్రభుత్వం సరఫరా చేస్తున్న సన్న బియ్యంతోపాటు ఇతర నిత్యవసర వస్తువులను ఈ-పాస్ యంత్రం ద్వారా పూర్తి తూకంతో అందించాలన్నారు. డీలర్లు తూకంలో మోసాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని, సరుకులు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే డీలర్‌షిప్ రద్దుతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని ఆయన హెచ్చరించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో దొడ్డు బియ్యంతో పేదలు అవస్థలు పడ్డారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన సన్న బియ్యం పంపిణీ చేయిస్తామన్నారు. కొత్త రేషన్ కార్డుల జారీ, కార్డుల్లో పేర్ల తొలగింపు, చేర్పులు, తప్పుల సవరణ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు.

# ఎన్యూమరేషన్ ఫారంలను గడువు లోపు అందించాలి

తెలంగాణ పత్రిక నిజామాబాద్, జూలై 06 :

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్.ఐ.ఆర్)లో భాగంగా ఎన్యూమరేషన్ ఫారంను పూరించి, నిర్ణీత గడువు లోపు ప్రతి ఓటరు తప్పనిసరిగా బూత్ లెవెల్ అధికారికి అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. సోమవారం ప్రజావాణి అనంతరం కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అన్ని శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు అందరూ విధిగా ఈ నెల 24వ తేదీ లోపు ఎన్యూమరేషన్ ఫారంను నింపి బీ.ఎల్.ఓలకు అందించాలన్నారు. లేని పక్షంలో ఆగస్టు 5న ప్రచురించే ఓటర్ల ముసాయిదా జాబితాలో పేరు కోల్పోతారని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ విషయాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ తేలికగా తీసుకోకూడదని, అధికారులు ఎంత పెద్ద హోదాలో, ఏ స్థాయిలో ఉన్నా ఎన్నికల సంఘం నిర్దేశించిన మేరకు ఎన్యూమరేషన్ ఫారం అందించాల్సిందేనని అన్నారు. జిల్లాలో దాదాపుగా అన్ని ప్రాంతాలలో ఇప్పటికే ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ పూర్తయ్యిందని తెలిపారు. అయితే తీసుకున్న ఎన్యూమరేషన్ ఫారంలను తగిన వివరాలతో పూరించి, బీ.ఎల్.ఓలకు గడువు లోపు అందించడం ఎంతో ముఖ్యమని సూచించారు. ఈ మేరకు ఓటర్లకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని, వివిధ శాఖల జిల్లా అధికారులకు, మండల స్పెషల్ ఆఫీసర్లు అవకాశం మేరకు తహసిల్దార్ కార్యాలయాలను సందర్శించి, ఎస్.ఐ.ఆర్ అమలు తీరును, బీ.ఎల్.ఓల పనితీరును పరిశీలించాలని అన్నారు.



కాగా, ఎన్యూమరేషన్ ఫారం భర్తీ విషయంలో, ఎస్.ఐ.ఆర్ ప్రక్రియకు సంబంధించి ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ, తగిన సహకారం అందించేందుకు వీలుగా కలెక్టరేట్ లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజ్ ను ఆదేశించారు ఇదిలాఉండగా, సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూల్స్ ను క్రమం తప్పకుండా సందర్శించాలని మండల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. విద్యా సంస్థలను మొక్కుబడిగా సందర్శించకుండా, వాటి పనితీరును నిశితంగా పరిశీలించాలని, ఏమైనా సమస్యలు ఉన్నాయా అన్నది గమనించాలని అన్నారు. అధికారుల సందర్శనతో విద్యా సంస్థల పనితీరులో స్పష్టమైన మార్పు కనిపించాలన్నారు. ఓపెన్ బావులు వంటి ప్రమాదకర పరిస్థితులు నెలకొని ఉంటే వెంటనే తమ దృష్టికి తేవాలన్నారు. విద్యార్థులు పాముకాటు, విష కీటకాల బారిన పడకుండా అన్నివిద్యా సంస్థల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అంకిత భావంతో ఉత్తమ స్థాయిలో విధులు నిర్వర్తించే మండల స్పెషల్ ఆఫీసర్ ను ఎంపిక చేసి తగిన ప్రోత్సాహకం అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీ.ఆర్.ఓ గీత, జెడ్పీ సీ.ఈ.ఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, డీ.పీ.ఓ శ్రీనివాస్ రావు, నిజామాబాద్ ఏసీపీ ప్రకాశ్, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

Editor, Printer, publisher and owned by B. VENKATESHAM, printed at RAMANI WEB OFFSET PRINTERS, H. NO. 8-82/11/1,Auto Nagar, village Bommakal, Mdl and District :Karimnagar -500001. Telangana state, published at H. NO. 9-10/7A Krishna nagar, Bommakal village Mdl and district Karimnagar 505001,Telangana state, Editor :B. VENKATESHAM Cell :8341110143